ప్రజాశక్తి
శుక్రవారం 18 ఆగస్టు 2023
5
కర్నూలు



అనుమానం పెనుభూతమై...

- భార్యపై అనుమానంతో వేట కొడవలితో వీరంగం
- కొడుకును చంపి... ఆత్మహత్య చేసుకున్న తండ్రి
- దేవనకొండలో దుర్ఘటన

ప్రజాశక్తి - దేవనకొండ

అనుమానం పెనుభూతమైంది. ఓ కుటుంబాన్ని ఛిద్రం చేసింది. దేవనకొండకు చెందిన ఓ వ్యక్తి భార్యపై అనుమానంతో కొడుకును చంపి, తాను ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ దుర్ఘటన దేవనకొండ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు... దేవనకొండ గ్రామానికి చెందిన రంగులాల్ కుమార్తె అనితను డోన్ మండలం పెద్దపూజర్ల గ్రామానికి చెందిన రాజు (32) అనే వ్యక్తి 10 ఏళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. కొన్ని సంవత్సరాల పాటు వారి జీవనం సవ్యంగా సాగింది. వీరు వివాహ బంధానికి కొన్నేళ్లుగా దూరంగా ఉంటున్నారు. అనిత కొన్ని సంవత్సరాల నుంచి తల్లి దగ్గర ఉంటూ ఓ ప్రయివేట్ పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేస్తూ ఇద్దరు కుమారులను పోషిస్తున్నారు. మృతి చెందిన రెండో కుమారుడు ఉజ్వల్ (3) తనకు పుట్టలేదని, భార్యపై అనుమానంతో రాజు గురువారం భార్య ఇంటి ముందు కత్తితో, వేట కొడవలితో వీరంగం సృష్టించాడు. అత్త, భార్యపై దాడి చేయడానికి ప్రయత్నించగా తప్పించుకున్నారు. బాలుడు ఉజ్వల్‌ను కొట్టి నోటిలో పురుగు మందు వేసి, అనంతరం పురుగు మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డారు. చికిత్స నిమిత్తం గ్రామస్తులు స్థానిక ప్రాథమిక ఆరోగ్య వైద్య కేంద్రానికి తరలించేలోపు రాజు మృతి చెందారు. కొన ఊపిరితో ఉన్న కుమారుని కోడుమూరు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. అభం శుభం తెలియని కుమారుని మృతితో తల్లి అనిత రోధిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది. ఎస్ఐ భూపాలుడు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పత్తికొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



కొడుకు మృతదేహం వద్ద రోధిస్తున్న తల్లి అనిత



రాజు మృతదేహం



మృతి చెందిన బాలుడు ఉజ్వల్

అప్రకటిత కోతలు

- లోడ్ రిలీఫ్ పేరుతో విద్యుత్ నిలిపివేత - చీకట్లో అల్లాడుతున్న ప్రజలు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

జిల్లాలో అప్రకటిత విద్యుత్ కోతలు మొదలయ్యాయి. లోడ్ రిలీఫ్ పేరుతో విద్యుత్ కోత పెడుతుండటంతో ప్రజలు చీకట్లో గడపాల్సి వస్తోంది. ఎడా పెడా విద్యుత్తు కోతలతో గ్రామీణులు అల్లాడుతున్నారు. సాయంత్రం వేళల్లో కోతలు విధిస్తుండటంతో పలు గ్రామాల్లో ప్రజలు సబ్ స్టేషన్లను ముట్టడిస్తున్నారు...

ఉమ్మడి జిల్లాలో అప్రకటిత విద్యుత్తు కోతలు పెరిగిపోయాయి. రాత్రి వేళ కరెంట్ ఎప్పుడు ఉంటుందో ఎప్పుడు నిలిపివేస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. డిమాండ్ మేరకు ఉత్పత్తి లేకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో ఇష్టాను సారం సరఫరా ఆపేస్తున్నారు. అత్యంవసర లోడ్ రిలీఫ్ పేరిట గంటల తరబడి కోతలు విధిస్తుండటంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. నిద్రలేని రాత్రిళ్లు గడపాల్సి వస్తోందని గ్రామీణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో సాధారణంగా 13 నుంచి 14 మిలి యన్ యూనిట్ల విద్యుత్తు వినియోగం జరుగుతోంది. 640 మెగా వాట్ల డిమాండ్ ఉంటోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వారం రోజుల క్రితం వరకూ 50 మెగావాట్ల విద్యుత్ లోటు ఉండగా అది ఇప్పుడు 60 మెగావాట్లకు పెరిగింది. వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలు గడిచినా ఆశించినంత వర్షపాతం నమోదు కాలేదు. గత నెలలో మూడు రోజుల పాటు కురిసిన వర్షాలు మినహా ఉమ్మడి జిల్లాలో ఎక్కడా భారీ వర్షాలు కురవలేదు. ఇదే సమయంలో ఎండల తీవ్రత కూడా అధికంగానే ఉంది. దీంతో ప్రస్తుతం జిల్లాలో విద్యుత్తు వియోగం వేసవిలో ఉన్నట్లే ఉంది. సాయంత్రం 6 గంటల నుంచి గృహ, వాణిజ్య వినియోగం ఎక్కు వగా ఉంటోంది. కర్నూలు, నంద్యాల జిల్లాల పరిధిలో సాయంత్రం 7.30 నుంచి అర్ధరాత్రి 12 గంటల మధ్య 750 మెగావాట్ల డిమాండ్ ఉన్నట్లు విద్యుత్తు శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ సమయంలోనే సరఫరా లోటు ఏర్పడి గ్రామాల్లో కోతలకు కారణం అవుతోంది. విద్యుత్తు లోటు పెరుగుతుండటంతో నంద్యాల జిల్లాలోని సిమెంటు పరిశ్రమలపై విద్యుత్తు శాఖ ఆంక్షలు పెట్టింది. పాణ్యం, జేఎస్ డబ్ల్యూ తదితర సిమెంటు కర్మాగారాలతో పాటు భారీ పరిశ్రమలు సాయంత్రం 6 గంటల నుంచి విద్యుత్తు వినియోగాన్ని పూర్తిస్థాయిలో తగ్గించాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. లోటు ఇలాగే కొనసాగితే ఈ పరిశ్రమలకు సాయంత్రం నుంచి రాత్రి వరకు సరఫరా నిలిపివేసే అవకాశాలనూ అధికారులు పరిశీలిస్తు న్నారు. ఎడా పెడా విద్యుత్తు కోతలతో గ్రామీణులు అల్లాడుతున్నారు. సాయంత్రం వేళల్లో కోతలు విధిస్తుండటంతో పలు గ్రామాల్లో ప్రజలు సబ్ స్టేషన్లను ముట్టడిస్తున్నారు.



'బెదురులంక' టీమ్ సందడి

- అశోకా కళాశాలలో అలరించిన సినీ హీరో కార్తికేయ
- విద్యార్థినులతో కలిసి ఆడిపాడిన కార్తికేయ - సెల్ఫీలతో సందడి
- కర్నూలుతో తన అనుబంధాన్ని గుర్తు చేసుకున్న కార్తికేయ

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

'బెదురులంక' సినిమా టీం గురువారం కర్నూలులోని 'అశోకా' ఉమెన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో సందడి చేసింది. కళాశాల ఆడిటోరియంలో మూవీ ప్రమోషన్స్ చేపట్టింది. 'బెదురులంక-2012' మూవీ ఈనెల 25న విడుదల కానుంది. హీరో కార్తికేయ పాల్గొని విద్యార్థినులతో కలిసి మూవీ సాంగ్స్‌కు డ్యాన్స్ వేశారు. సెల్ఫీలతో సందడి చేశారు. ఈ సందర్భంగా హీరో కార్తికేయ మాట్లాడారు. తనకు కర్నూలుతో చాలా అనుబంధం ఉందని తెలిపారు. 'అశోకా' లోని ఆహ్లాదకరమైన వాతావరణం తనను బాగా ఆకట్టుకుందని అన్నారు. గత కొద్ది సంవత్సరాలుగా 'అశోకా కాలేజ్ సాధిస్తున్న విజయాలు, ప్లేస్‌మెంట్స్ గురించి విన్నామని తెలిపారు. మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా తాము కర్నూలులోని 'అశోకా' కాలేజీకి వచ్చామని చెప్పారు. తమ చిత్రం ఈ నెల 25న థియేటర్లలో విడుదలకు సిద్ధమైందని తెలిపారు. చిత్రాన్ని అందరూ చూసి ఆదరించాలని కోరారు. అనంతరం హీరో 'కార్తికేయ' అశోకా కాలేజ్ ఛైర్మన్ అశోక్ వర్ధన్ రెడ్డిని కలిసి తమ మూవీ విశేషాలను, 'కర్నూలు'తో తన అనుబంధం గురించి చర్చించారు. మూవీ ప్రమోషన్స్‌లో మూవీ టీమ్, 'అశోకా' కాలేజ్ బిటెక్, ఎంబిఎ, ఎంసిఎ విద్యార్థులు, కాలేజ్ స్టాఫ్ పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి డ్యాన్స్ చేస్తున్న కార్తికేయ

ప్రయివేటు పాఠశాలల్లో నిలువు దోపిడీ

- సౌకర్యాలు అరకొర - ఫీజులు కార్పొరేట్ స్థాయి

ప్రజాశక్తి- పత్తికొండ

తమ పిల్లలను ఉన్నతంగా చదివించాలని తల్లిదండ్రులు ఆశను ప్రైవేట్ పాఠశాలలు ఆసరా చేసుకుని అడ్డంగా దోచుకుంటున్నారు. ప్రైవేట్ పాఠశాలలు అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తూ పేద మధ్య తరగతి కుటుంబాలను నిలువు దోపిడి చేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. పత్తికొండ పట్టణంలోని మొత్తం 24 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. పాఠశాలల్లో నిబంధన ప్రకారం నిష్ణాతులైన విద్యాబోధన చేయాల్సి ఉన్నప్పటికీ డిగ్రీ ఇంటర్మీడియట్ చదివిన నిరుద్యోగ యువకుల చేత విద్యాబోధన చేయిస్తున్నారు. పాఠశాలలో అరకొర సౌకర్యాలు ఉన్నప్పటికీ ఫీజులను మాత్రం కార్పొరేట్ స్థాయిలో దండుకుంటున్నారు.

ప్రయివేట్ పాఠశాలలో కార్పొరేట్ ఫీజులు..

పట్టణంలోని యశోద గార్డెన్ స్కూల్‌ను ఇటీవల శ్రీ చైతన్య విద్యా సంస్థ నడుపుతుంది. .గతంలో యశోద గార్డెన్ స్కూలు యాజమాన్యం నిర్వహించే పాఠశాలలోనే శ్రీ చైతన్య స్కూల్ గా మార్పు చెందింది. రికార్డుల ప్రకారం యశోద గార్డెన్ స్కూల్‌గా ఉన్నప్పటికీ కార్పొరేట్ పాఠశాలగా మార్చి బాగా ఫీజులు పెంచారు.ఎల్‌కెజి ,యుకెజి పిల్లల ఫీజులే ఆ పాఠశాలలో రూ.13000వేల పైగానే ఉన్నాయి. సాధారణంగా ప్రవేట్ పాఠశాలలో ఈ ఫీజులు రూ. 7 000 వరకు ఉంటుంది. ఒకే కుటుంబంలో 9 ,10వ తరగతి చెందిన విద్యార్థులు ఇద్దరికి రూ. 75 వేల ఫీజులు వసూలు చేస్తున్నారు.

పాఠశాలలో అరకొర సౌకర్యాలు

పాఠశాలలోభారీగా ఫీజులు చేస్తున్నప్పటికీ సౌకర్యాలు కల్పించడంలో మాత్రము నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పట్టణంలో నడిబొడ్డున ఉండే రెండు పాఠశాలలో కనీసం మరుగుదొడ్ల సౌకర్యాలు కూడా లేవు. పిల్లలు ఆడుకునేందుకు కనీసం గ్రౌండ్ కూడా లేదు. విద్యార్థులకు అనుగుణంగా టాయిలెట్ సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

ఫీజులు ఎక్కువైనా చదివిస్తున్నాం : వెంకటేశ్వర రెడ్డి..



పిల్లలను బాగా చదివించాలని ఆశతో ప్రైవేట్ పాఠశాలలో బారీగా ఫీజులు ఉన్నా చదివిస్తున్న మా ఇద్దరి పిల్లలను పట్టణంలో కార్పొరేట్ పాఠశాలలో చదివిస్తున్నాం. పేరు మాత్రం ప్రైవేటు పాఠశాల అయినప్పటికీ కార్పొరేట్ ఫీజులు వసూలు చేస్తున్నారు. 9 ,10వ తరగతి చదివే ఇద్దరి పిల్లలకు కేవలం చదువు చెప్పేందుకే రూ.75 వేల రూపాయలు చెల్లిస్తున్నారు.

ఒకటో తరగతికి రూ. 15000 ఫీజు : రంగన్న



ఫీజులు భారం అనిపించినప్పటికీ పిల్లలను బాగా చదివించాలని ప్రైవేట్ పాఠశాలలో చేర్పించాం. యుకెజి చదివే వానికి రూ.11000, ఒకటో తరగతి చదివే వానికి రూ.15000 చెల్లిస్తున్నాం. ప్రైవేటు ఉద్యోగం చేస్తూ పిల్లలను చదివించడం భారం అవుతుంది.

యుద్ధ ప్రాతిపదికన

ఇళ్ల నిర్మాణాలు పూర్తి

- కలెక్టర్ డాక్టర్ సృజన

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

పునాది స్థాయి కంటే కింద ఉన్న ఇళ్ల నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఎంపిడిఒలను ఆదేశించారు. గురువారం మండల స్పెషల్ ఆఫీసర్లు, ఎంపిడిఒలు, హౌసింగ్ ఇంజినీర్లు, ఎంఇఒలు, తదితరులతో హౌసింగ్, గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో, ఉపాధి హామీ తదితర అంశాలపై కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ఇళ్ల నిర్మాణాల ప్రగతిలో అధికారులు ఆశించినంత ప్రగతి చూపించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. క్రిష్ణగిరి, చిప్పగిరి, వెల్దుర్తి, కౌతాళం, కర్నూలు అర్బన్, కల్లూరు, పత్తికొండ, మంత్రాలయం, తుగ్గలి, కోసిగి, ఎమ్మిగనూరు మండలాల్లో 50 కంటే పైగా బిలో బేస్‌మెంట్ ఇళ్ల నిర్మాణాలు ఉన్నాయని తెలిపారు. వీటిని ఈ నెలాఖరులోపు బేస్‌మెంట్ స్థాయికి తీసుకురావాలని ఆదేశించారు. ఎంపిడిఒలు, హౌసింగ్ ఎఇలు సమీక్షించుకుని పురోగతి చూపేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. ఈ అంశంపై పర్యవేక్షణ చేయాలని హౌసింగ్ పీడీని ఆదేశించారు. బేస్‌మెంట్ లెవెల్ స్థాయి నుంచి కంప్లీషన్ స్థాయి ఇళ్ల నిర్మాణాల్లో ఒక్క స్టేజి కన్వర్షన్ కూడా చేయలేదని కోడుమూరు, కర్నూలు అర్బన్, వెల్దుర్తి, హాలహర్వి, ఆదోని అర్బన్ మండలాల హౌసింగ్ ఎఇలను ప్రశ్నించారు. నిర్దేశించిన లక్ష్యాలను సాధించడంలో నిర్లక్ష్య ధోరణిని విడిచిపెట్టి పురోగతి సాధించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం హౌసింగ్ నిర్మాణాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టిందని తెలిపారు. మండల స్పెషల్ ఆఫీసర్లు వారికి కేటాయించిన మండలాలకు వెళ్లి ఏవైనా సమస్యలుంటే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు లేనందున హౌసింగ్‌కు సంబంధించిన పురోగతి లేదని క్రిష్ణగిరి ఎఇ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. అలాంటి సమయాల్లో వారి లాగిన్ తీసుకొని వర్క్ ఇన్‌స్పెక్టర్ల ద్వారా పని చేయించాలని తెలిపారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు లేరని, పురోగతి లేదని చెప్పడం ఏమిటని హౌసింగ్ అసిస్టెంట్ ఇంజినీర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెల 25 నాటికి రాష్ట్రవ్యాప్తంగా 5 లక్షల ఇళ్ల పూర్తిలో భాగంగా జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలను వంద శాతం పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. 25 తర్వాత 100 శాతం కంటే తక్కువ ఉండకూడదని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి ఈనెల 25న అన్ని లేఅవుట్లలో పూర్తి చేసిన ఇళ్లను ప్రారంభోత్సవం చేయనున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. హౌసింగ్ పీడీ వెంకట నారాయణ, డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి, పంచాయతీ రాజ్ ఎస్ఇ సుబ్రమణ్యం, ఎస్ఎస్ఎ పిఒ వేణుగోపాల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ సృజన



టిడిపి మినీ మేనిపెస్టోను వివరిస్తున్న టిజి.భరత్

కర్నూలుకు హైకోర్టు బెంచ్ తెస్తా : టిజి.భరత్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

తెలుగుదేశం ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల్లోపు హైకోర్టు బెంచ్ కర్నూలుకు తీసుకువస్తామని కర్నూలు నియోజకవర్గ టిడిపి ఇంఛార్జీ టిజి భరత్ అన్నారు. కర్నూలు నగరంలోని 22వ వార్డు అరోరా నగర్‌లో ఆయన భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ప్రజలు అర్హులైనా పింఛన్ అందడం లేదని చెప్పారు. మోడల్ స్కూలులో పని చేస్తున్నందుకు సంక్షేమ పథకాలు ఇవ్వడం లేదన్నారు. నిత్యావసర సరుకుల రేట్లు పెరిగిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. టిజి భరత్ మాట్లాడుతూ రాష్ట్రానికి చంద్రబాబు నాయుడు నాయకత్వం ఎంతో అవసరమని చెప్పారు. తెలుగుదేశం ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్క రిస్తామని హామీ ఇచ్చారు. టిడిపి మొదటి విడత మేనిఫెస్టోలో ప్రజలకు ఎంతో ఉపయోగపడే సంక్షేమ, అభివృద్ధి అంశాలు ఉన్నాయని వివ రించారు. తనను కర్నూలు ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఐదేళ్లు మంచిగా పరిపాలన అంది స్తానని చెప్పారు. టిడిపి నాయకులు శ్రీధర్, చంద్రశేఖర్, సాయి, సూర్య ప్రకాష్, వంశీ, మురళీకృష్ణ, ప్రవీణ్ , గీత, వనిత, రంగనాథ్, పుష్పలత, రామేశ్వరి, లలితమ్మ విష్ణు, వసంత లక్ష్మి, భాస్కర్, రమణ, పాల్గొన్నారు.

దళిత మహిళ అత్యాచార కేసులో ముద్దాయిల అరెస్ట్

ప్రజాశక్తి-తుగ్గలి : తుగ్గలి మండలం ఎద్దులదొడ్డి గ్రామంలో దళిత మహిళపై అత్యాచారం చేసి ఆపై సంఘటనను చిత్రీకరించిన నిందితులు బోయ పందికోన రామానాయుడు, ఉపేంద్రగౌడ్‌ను ఎస్సీ ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కేసులో సెక్షన్ 323, 354, 376 కింద అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు తుగ్గలి ఎస్ఐ మల్లికార్జున గురువారం రాత్రి విలేకరులకు తెలిపారు. గురువారం సాయంకాలము తుగ్గలి పోలీస్ స్టేషన్ దగ్గర ఉన్న నిందతులను సిసిఎస్ డిఎస్‌పి శ్రీనివాసులు తమ సిబ్బందితో కలిసి అదుపులోకి తీసుకొని అరెస్టు చేసామన్నారు.

సిబెళగల్ మండల ఉపాధి ఇసికి ప్రశంస

ప్రజాశక్తి-సి బెళగల్



మండల ఉపాధి ఇసి పద్వికి స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా మంగళవారం ప్రశంసపత్రం ఆందజేశారు. మండలంలో ఉపాధి పనులను అందరికి అందేలా తగిన కృషి చేశారని ఉత్తమ ఇసి జాబితాలో కేక్కారు. కలెక్టర్ సారథ్యంలో జిల్లా కేంద్రంలో ఉపాధి పిడి అమర్నాథ్ రెడ్డి చేతుల మీదుగా అందుకున్నట్లు తెలిపారు.

సచివాలయ కన్వీనర్లకు ఉచిత బీమా

రావూరి గార్డెన్‌లో బీమా నమోదుపై శిక్షణ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

సచివాలయ కన్వీనర్లకు ఉచిత బీమా కల్పిస్తున్నామని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి తెలిపారు. సచివాలయ కన్వీనర్లకు ఉచిత బీమా నమోదుపై గురువారం రావూరి గార్డెన్‌లో వైసిపి యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అక్కిమి హనుమంతరెడ్డి అధ్యక్షతన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలు, కల్లూరు అర్బన్ జేసిఎస్ ఇంచార్జ్ లు, కన్వీనర్లు, పలువురు ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో కన్వీనర్లు, గృహ సారధుల పాత్ర ఎలా ఉండాలి, ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి ఏ విధంగా తీసుకెళ్లాలన్న అంశంపై పలు రకాల సూచనలు, సలహాలు ఇచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చెప్పిన విధంగా సచివాలయ కన్వీనర్లకు, గహసారధులకు ఉచిత బీమా నమోదు ఏ విధంగా చేసుకోవాలని, అన్న విషయాలను తెలిపారు. జెసిఎస్ సైన్యం యాప్‌ను డౌన్ లోడ్ చేసుకుని అందులో తమ వివరాలను ఎలా పొందుపరచాలన్న విషయాలను క్షుణ్ణంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ మీది వేముల ప్రభాకర్ రెడ్డి, డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక, జడ్‌పిటిసిలు, ఎంపిపిలు, సర్పంచులు, కార్పొరేటర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, జెసిఎస్ ఇంచార్జులు, వివిధ సంఘాల డైరెక్టర్లు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

హమాలీ కార్మికులకు సంక్షేమబోర్డును ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్



హమాలి కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం డి.అంజిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కర్నూలు జిల్లా హమాలీ కార్మికుల ఫెడరేషన్ జిల్లా సదస్సు కె.కె. భవన్‌లో హమాలీ కార్మికుల ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం. వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. అంజిబాబు,సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.ఎస్ రాధాకష్ణ, న్యూసిటీఅధ్యక్ష కార్యదర్శులు సిహెచ్.సాయిబాబా, ఆర్.నరసింహులు సిఐటియు ఓల్డ్ సిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.విజయ్, డి.అబ్దుల్ దేశాయ్ లు హమాలీ కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ హమాలీ కార్మికులు పగలనక రాత్రనక మూటలు మోస్తూ, చాలీచాలని వేతనాలతో కుటుంబాలను పోషించుకుంటూ పిల్లలను చదివించుకుంటూ జీవనం చేస్తున్నారన్నారు. పనిప్రదేశంలో సరైన వసతులు లేక ఏదైనాప్రమాదం జరిగినా, గాయాల పాలైనా ప్రమాదవశాత్తు మరణించిన కార్మికుల కుటుంబాలను పట్టించుకునే నాధుడే లేడన్నారు. రోజు మూటలు మోసి, మోకాళ్ళ,నడుం, మెడ దగ్గర ఎముకలు అరిగి 50 సంవత్సరాలు వయస్సు రాక ముందే మూటలు మోయలేక పని చేయలేక, అనారోగ్యాల బారినబడి వయస్సు మల్లకముందే ముసలివాళ్ళవలె ఇంటి దగ్గరే ఉండి కుటుంబానికి భారంగా మారిన పరిస్థితి ఉందన్నారు. ఇఎస్ఐ, పిఎఫ్, పెన్షన్, పని భద్రత, బీమా సౌకర్యం, కనీస వేతనం ఇవ్వాలని కోరింది. ఈనెల నెల 25లోపు జిల్లా, పట్టణ, మండల కమిటీలు ఏర్పాటుచేసి, సెప్టెంబర్6 నుండి 20 తారీకు వరకు సంతకాల సేకరణ చేయాలన్నారు. ఎమ్మెల్యేలకు, ఎంపీలకు, మంత్రులకు వినతి పత్రాలు ఇవ్వాలని నిర్ణయించారన్నారు. అనంతరం కర్నూలు జిల్లా హమాలీ కార్మికుల ఫెడరేషన్ కమిటీ 27 మందితో ఏర్పడింది. కమిటీ జిల్లా కన్వీనర్ గా ఎం.వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షులుగా పిఎస్.రాధాకృష్ణ లను సమావేశం ఏకగ్రీవంగా ఎన్నుకుంది.

కెడిసిసిబి బ్రాంచీలలో 'ఇ'- స్టాంపు సేవలు

కెబిసిసిబి చైర్మన్ విజయ మనోహరి

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో ఇ సౌకర్యాన్ని అందరూ ఉపయోగించుకోవాలని బ్యాంకు ఛైర్మన్ ఎస్‌వి. విజయ మనోహరి , సిఇఒ పి.రామాంజనేయులు తెలిపారు. రైతుసోదరుల , ఖాతాదారుల సేవార్థం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సహకారంతో స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ ద్వారా ఇ-స్టాపింగ్ సదుపాయం కల్పించేందుకు బ్యాంకు ఛైర్‌పర్సన్ ఎస్‌వి.విజయ మనోహరి ఆధ్వర్యంలో బ్యాంకు ముఖ్యకార్యనిర్వహణాధికారి పి.రామాంజనేయులు, ఆప్కాబ్ తరపున డిజిఎం బాలాజీ , స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ అధికార్లు సాంబశివారెడ్డి, నర్సిరెడ్డిలు గురువారం బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో ఒప్పందం చేసుకున్నారని బ్యాంక్ ముఖ్య కార్యనిర్వహణాధికారి రామాంజనేయులు తెలిపారు. అంతేగాక ముఖ్యంగా అధిక ఫీజు పెట్టి స్టాంపులు కొనవలసిన అవసరముండదని, దీనివలన చాలా సొమ్ము ఆదా అవుతుందన్నారు. ఈ సౌకర్యాన్ని అందరు ఉపయోగించుకోవాలని బ్యాంకు ఛైర్మన్ ఎస్‌వి. విజయ మనోహరి , సిఇఒ పి. రామాంజనేయులు తెలిపారు.





డిఎంహెచ్ఒకు వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్లా, రంగప్ప

నర్సింగ్ విద్యార్థులను వేధిస్తున్న వైద్యుడిపై చర్యలు తీసుకోవాలి

డిఎంహెచ్ఒకు ఎస్ఎఫ్ఐ వినతి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ప్రభుత్వ ఆస్పత్రిలో నర్సింగ్ విద్యార్థులను వేధిస్తున్న వైద్యుడిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా వైద్యాధికారి రామగిడ్డయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ కర్నూలు జిల్లా కార్యదర్శి అబ్దుల్లా అధ్యక్షులు రంగప్ప మాట్లాడుతూ కల్లూరు ప్రభుత్వ ఆసుపత్రిలో నర్సింగ్ విద్యార్థులను వేధిస్తున్న వైద్యుడిపై చర్యలు తీసుకోవాలన్నారు. కర్నూలు నగరంలో ఉన్న ఆదర్శ నర్సింగ్ స్కూల్లోని ఎఎన్ఎం ,జిఎన్ఎమ్ కోర్సులలో చేరిన మొదటి సంవత్సరం విద్యార్థులు కోర్స్ నిబంధనల ప్రకారం మూడు నెలలు విద్యార్థులు ఏదైనా హాస్పిటల్లో పనిచేయాల్సి ఉంటుంది. అలా కల్లూరు లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లిన విద్యార్థినిలను రెండు నెలలుగా అక్కడ ఉన్న డాక్టర్ ఇబ్బంది పెట్టడం వల్ల మానసికంగా ఇబ్బంది పడి పిహెచ్‌సికి వెళ్లలేక పోతున్నారన్నారు.. విద్యార్థులను మానసికంగా లైంగికంగా వేధిస్తున్న డాక్టర్‌పై పూర్తిస్థాయి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు సాయిఉదయ్ , అమర్ , నరసింహ, నగర నాయకులు ఆర్యన్ పాల్గొన్నారు.

మహా శక్తితో మహిళలకు ఆర్థిక స్వావలంబన : గౌరుచరిత

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

టిడిపి అధినేత నారా చంద్రబాబు ప్రకటించిన మహాశక్తి మినీ మేనిఫెస్టో వల్ల మహిళలకు ఆర్థిక స్వావలంబన లభిస్తుందని ఆ పార్టీ పాణ్యం ఇంచార్జి గౌరు చరిత అన్నారు. గురువారం కల్లూరు అర్బన్ 36వ వార్డు మహాశక్తి రథయాత్ర ప్రచార కార్యక్రమం , భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. వార్డు ఇంచార్జి రెడ్డి గారి తిరుమలేశురెడ్డి, మహిళ నాయకురాలు రమణమ్మ, సింగిల్‌విండో మాజీ ప్రెసిడెంట్ ఎన్‌వి. రామకృష్ణ, జిల్లా కోశాధికారి పియూ మాదన్న, బిసిసెల్ రాష్ట్ర కార్యదర్శి కాసాని మహేష్‌గౌడ్, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు గంగాధర్‌గౌడ్, కేతురు మధు పాల్గొన్నారు.



టిడిపి భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో గౌరు చరిత

ప్రతి ఇంటికీ తాగునీరు

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు

ప్రజాశక్తి - హొళగుంద



లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న మంత్రి గుమ్మనూరు

జలజీవన్ మిషన్ ద్వారా ఎల్లార్తి గ్రామంలో టెండర్లు పూర్తయిన వెంటనే రూ.56 లక్షలతో ప్రతి ఇంటికీ తాగునీరు అందిస్తామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్ తెలిపారు. గురువారం మండలంలోని ఎల్లార్తి గ్రామంలో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. నాయకులు, అధికారులు, గ్రామస్తులు తప్పెట్లు, శాలువా, బాణసంచా, పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి నియోజకవర్గానికి రూ.1050 కోట్ల సంక్షేమ ఫలాలు అందాయని తెలిపారు. గ్రామంలో సంక్షేమ పథకాల ద్వారా దాదాపు రూ.16.42 కోట్ల లబ్ధి చేకూరిందని చెప్పారు. గ్రామ సచివాలయం నిధులు రూ.10 లక్షలతో 60 వేల లీటర్ల నీటి సంపు ఏర్పాటు చేయాలని తెలిపారు. గ్రామంలో రూ.10 లక్షలు మౌలిక సదుపాయాల కోసం ప్రణాళికలు సిద్ధం చేసి పనులు ప్రారంభించాలని చెప్పారు. అనంతరం గ్రామంలో వెలసిన హజరత్ షేక్షావలీ, హజరత్ షాషావలీ దర్గాలను సందర్శించి ప్రత్యేక ఫాతేహాలు నిర్వహించారు. మంత్రి సోదరుడు గుమ్మనూరు నారాయణ స్వామి, సర్పంచి కె.చాముండేశ్వరి, ఎంపిపి తనయుడు ఈషా, మండల కన్వీనర్ షఫీ, జడ్‌పిటిసి బావ శేషప్ప, నాయకులు మల్లికార్జున, ఎస్‌కె.గిరి, దర్గప్ప, లక్ష్మీకాంత్, మాజీ జడ్‌పిటిసి రాంభీం నాయుడు పాల్గొన్నారు.

టిడిపి కుట్రలను ప్రజలు నమ్మరు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పెద్దకడబూరు



బాలనాగిరెడ్డికి, ప్రదీప్‌రెడ్డికి పూలమాల వేస్తున్న నాయకులు

టిడిపి ఎన్నికల కుట్రలు, కుతంత్రాలు చేసినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తెలిపారు. వచ్చే 2024 ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని జోష్యం చెప్పారు. గురువారం మండలంలోని చిన్నతుంబలం గ్రామంలో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల అమలు, వాటి లబ్ధిపై ఆరా తీశారు. లబ్ధి పొందిన వారికి బుక్‌లెట్ అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డిని, వైసిపి యువజన నాయకులు వై.ప్రదీప్‌రెడ్డిని నాయకులు పూలమాలలతో సన్మానించారు. అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేసి పిల్లలకు పౌష్టికాహారం గురించి అడిగి తెలుసుకున్నారు. మండల నాయకులు రామ్మోహన్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎంపిటిసి ఎల్లప్ప, తహశీల్దార్ వీరేంద్ర గౌడ్, ఎఒ ఎం.వరప్రసాద్ పాల్గొన్నారు.

టిడిపికి పూర్వవైభవం తెస్తాం : టిడిపి

ప్రజాశక్తి - ఆదోని



ఎన్‌టిఆర్ ఫ్యాన్స్ రాష్ట్ర కన్వీనర్‌ను కలిసిన టిడిపి నాయకులు

నియోజకవర్గంలో టిడిపికి పూర్వ వైభవం రావడం ఖాయమని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి విజయం సాధించడం ఖాయమని మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ భాస్కర్ రెడ్డి, దేవేంద్రప్ప, పెద్ద మసీదు కమిటీ ఛైర్మన్ సౌదీ రావుఫ్, మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ ఫక్రుద్దీన్, మాజీ ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి తనయుడు సోమశేఖర్ రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని టిడిపి సీనియర్ నాయకులు, టిడిపి పట్టణ అధ్యక్షులు గుంటెప్ప, టిడిపి మాజీ నాయకులు నారాయణను కలిసి పార్టీ బలోపేతంపై చర్చించారు. ఇటీవల టిడిపి ఆదోని సీనియర్ నాయకులు, జూనియర్ ఎన్‌టిఆర్ అభిమాన సంఘ అధ్యక్షులు ముజీద్ మహ్మద్, మాజీ కౌన్సిలర్ తాయన్న, జూనియర్ ఎన్‌టిఆర్ వీరాభిమాని మల్లేషప్పను కలిసి టిడిపి బలోపేతంపై చర్చించినట్లు తెలిపారు. అధిష్టానం తమలో ఒకరికి టికెట్ ఇస్తామని హామీ ఇచ్చిందని, ఎన్నికల్లో సహకరించాలని కోరినట్లు వివరించారు. మాజీ కౌన్సిలర్ రామచంద్ర, మాజీ సర్పంచి కారుమంచి, నారాయణపురం షేక్షావలీ, మాజీ కౌన్సిలర్ మల్లికార్జున, ఎమ్‌డి.హుస్సేన్, జగదీష్, హుస్సేన్, మదిరె రమేష్, షేకన్న, రాచప్ప, బసవరాజ్ పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు : ఎఒ

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలో ఎరువులు, పురుగు మందుల విక్రయదారులు ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి విక్రయాలు చేస్తే చర్యలు తీసుకుంటామని ఎఒ సురేష్ బాబు హెచ్చరించారు. గురువారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో పెస్టిసైడ్స్, ఫర్టిలైజర్స్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పురుగు మందులు, ఎరువులు, విత్తనాలు రైతులకు అమ్మితే వాటికి తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలన్నారు. లైసెన్స్ లేకుండా విక్రయాలు జరపరాదన్నారు. స్టాక్ పాయింట్‌కు కచ్చితంగా గోడౌన్ అనుమతి ఉండాలని తెలిపారు.

జోరుగా ఉప ఎన్నికల ప్రచారం...

- వైసిపి, టిడిపి నాయకులతో బదినేహాల్ గ్రామంలో ఎన్నికల సందడి..!

ప్రజాశక్తి - కౌతాళం

మండలంలోని బదినేహాల్ గ్రామంలో సర్పంచి ఉప ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. గత సర్పంచి మాల రామప్ప మృతి చెందడంతో గ్రామంలో సర్పంచి ఎన్నికకు ఎన్నికల అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. గ్రామంలో వైసిపి మద్దతుదారుడు పెద్ద నరసప్ప పోటీ చేస్తుండగా, టిడిపి మద్దతుదారుల నుంచి హెచ్.వీరేష్ పోటీలో ఉన్నారు.

బదినేహాల్ వైసిపికి కంచుకోట

మండలంలో ఏ ఎన్నికలు జరిగినా మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డికి అత్యధిక మెజార్టీ లభిస్తుంది. టిడిపి ఇన్‌ఛార్జీ తిక్కారెడ్డి ప్రత్యేక దృష్టి సారించి బదినేహాల్ గ్రామంలో తిష్ట వేశారు. మండలంలోని క్లస్టర్ ఇన్‌ఛార్జీలతో పాటు నాయకులంతా ప్రచారంలో పాల్గొంటూ ప్రణాళిక రూపొందించి ప్రతి ఇంటికీ వెళ్లి ఓటు వేయాలని అడుగుతున్నారు. తెలుగు రైతు రాష్ట్ర జిల్లా కార్యదర్శి ఆదినప్ప గౌడ్, వెంకటపతి రాజు, జిల్లా ఉపాధ్యక్షులు చెన్న బసప్ప, టిడిపి నాయకులు కోట్రేష్ గౌడ్, టిప్పు సుల్తాన్, కురుగోడు, ఆయా గ్రామాల మాజీ సర్పంచులు, నాయకులు పాల్గొని ప్రచారం నిర్వహిస్తున్నారు. టిడిపి జిల్లా అధ్యక్షులు బిటి.నాయుడు, టిడిపి ఇన్‌ఛార్జీ తిక్కారెడ్డి, టిడిపి రాష్ట్ర నాయకులు శ్రీనివాస్ రెడ్డి, యువ నాయకులు దివాకర్ రెడ్డి రంగంలో దిగి ప్రచారం ముమ్మరం చేశారు. సర్పంచి ఉప ఎన్నికల్లో వైసిపి కంచుకోటలు బద్దలు కొట్టి విజయం సాధించాలని విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. టిడిపి బలపరిచిన అభ్యర్థికి ఒక్క అవకాశమిచ్చి ఓటు వేసి గెలిపించాలని కోరుతున్నారు. టిడిపితోనే అభివృద్ధి సాధ్యమని ప్రజలకు వివరిస్తున్నారు.

వైసిపి నాయకులు వీరభద్ర గౌడ్, నాకేష్ రెడ్డి, రవీంద్రారెడ్డి, లక్ష్మి రెడ్డి, వాసుదేవ రెడ్డి, కోఆప్షన్ సభ్యులు మాబు సాబ్ తమ సొంత గ్రామంలో ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. గతంలో కంటే అత్యధిక మెజార్టీతో గెలిపించి ఎమ్మెల్యే బాలనాగిరెడ్డికి బహుమతిగా అందించాలని సిద్ధపడ్డారు. వైసిపి మండల నాయకులు దాట్ల కృష్ణంరాజు, వీర సేనా రెడ్డి, మండల కన్వీనర్ దేశాయ్ ప్రహ్లాద చారి, ఉరుకుంద ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ నాగరాజు గౌడ్, మహేంద్ర రెడ్డి, రామన్న గౌడ్, ఏకం రెడ్డి, వైస్ ఎంపిపి బుజ్జి స్వామి, సుధాకర్ రెడ్డి, గుడిసె శేషన్న, వైస్ ఎంపిపి, కౌతాళం సర్పంచి పాల్ దినకర్, మాజీ సర్పంచి అవతారం, చౌడప్ప బసవరాజ్, ఆయా గ్రామాల సర్పంచులు, నాయకులు పాల్గొని ప్రచారం చేస్తున్నారు. గ్రామంలో వైసిపి, టిడిపి నాయకులతో ఎన్నికల సందడి నెలకొంది. శనివారం జరిగే ఎన్నికల్లో గెలుపు ఎవరిదో తేలనుంది.

జగనన్న సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి

- ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే గెలిపిస్తాయని ఎమ్మెల్యే వై.బాలనాగి రెడ్డి, వైసిపి నాయకులు వై.సీతారామిరెడ్డి తెలిపారు. గురువారం బదినేహాల్ గ్రామంలో వైసిపి నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ప్రతి ఇంటికీ పథకాలు అందించిన ఘనత తమకే దక్కుతుందన్నారు. ప్రజలు మంచి చేసే వారిని ఎన్నుకుంటారని పేర్కొన్నారు. వైసిపి నాయకులు ప్రతి ఒక్కరూ ప్రజాసేవకే అంకితం కావాలని కోరారు. టిడిపి నాయకుల మాటలు నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరన్నారు.



బదినేహాల్ గ్రామంలో టిడిపి నాయకుల ప్రచారం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలనాగి రెడ్డి



ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

సిపిఎం అభ్యర్థి రాణెమ్మను గెలిపించండి

- సిపిఎం మండల కార్యదర్శి తిక్కన్న

ప్రజాశక్తి -పెద్దకడబూరు

మండలంలోని కల్లుకుంట గ్రామంలో 11వ వార్డు మెంబర్‌గా సిపిఎం బలపరిచిన అభ్యర్థి హరిజన రాణెమ్మను ఆదరించాలని నాయకులు కోరారు. గురువారం గ్రామంలో ప్రచారం నిర్వహించారు. 11వ వార్డులోని ప్రతి ఇంటికీ వెళ్లి రాణెమ్మను అత్యధిక మెజారిటీ గెలిపించాలని కోరారు. సిపిఎం మండల కార్యదర్శి తిక్కన్న, రైతు సంఘం జిల్లా నాయకులు రమేష్, సిఐటియు నాయకులు ఈరన్న పాల్గొన్నారు.

'అప్పర్ భద్ర'తో పశ్చిమ రాయలసీమ ఎడారి



మాట్లాడుతున్న బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి

- రాయలసీమ స్టీరింగ్ కమిటీ ఛైర్మన్ బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి - నందవరం

'అప్పర్ భద్ర'తో పశ్చిమ రాయలసీమ ఎడారి మారుతుందని రాయలసీమ స్టీరింగ్ కమిటీ ఛైర్మన్ బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని నాగలదిన్నె గ్రామంలో 'రాయలసీమ రచ్చబండ' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రం విడిపోతే తెలంగాణ కన్నా రాయలసీమ తీవ్రంగా నష్టపోయిందని, సమైక్య వాదంతో రాయలసీమ మరుగున పడిపోయిందని తెలిపారు. కెసిఆర్ ఆర్‌డిఎస్, గుండ్రవుల వద్దకొచ్చి వాటాను తీసుకెళ్తామంటు న్నారని చెప్పారు. రాయలసీమ హక్కులు అడగకుండా జగన్, చంద్రబాబు, పవన్‌లు మోడీ జపం చేస్తున్నారని మండిపడ్డారు. రాయలసీమ స్టీరింగ్ కమిటీ నాయకులు నవీన్ కుమార్, సీమకృష్ణ పాల్గొన్నారు.

కళాశాల భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-ఆలూరు

ప్రభుత్వ డిగ్రీ, ఐటిఐ కళాశాలకు నిధులు కేటాయించి భవన నిర్మాణాలు చేపట్టాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. గురువారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో దశలవారీ కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో విద్యార్థులతో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి లక్ష్మీనారాయణ, మండల అధ్యక్షులు ఎస్.పోతురాజు మాట్లాడారు. ప్రభుత్వ డిగ్రీ, ఐటిఐ కళాశాలలకు స్థలం కేటాయించి భవనాలు నిర్మించాలని కొన్నేళ్లుగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తే స్థలం కేటాయించారని తెలిపారు. భవనాలు నిర్మించడంలో పాలకులు, అధికారులు విఫలం చెందారని విమర్శించారు. వలస ప్రాంతమైన నియోజకవర్గ పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని నిధులు మంజూరు చేయాలని కోరారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అదనంగా బికాం (కంప్యూటర్), బిఎస్‌సి, బిజడ్‌సి గ్రూపులు ఏర్పాటు చేసి అధ్యాపకులను నియమించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత తాత్కాలిక ఐటిఐ కళాశాల భవన పైకప్పు మరమ్మతులు చేపట్టి, ఐటిఐ కళాశాలకు కేటాయించిన స్థలానికి హద్దులను చూపించాలని తెలిపారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మిగిలి ఉన్న 20 శాతం భవన నిర్మాణ పనులను పూర్తి చేసి, పాలిటెక్నిక్ కళాశాలను రెసిడెన్షియల్‌గా మార్చాలని కోరారు. ఎస్ఎఫ్ఐ మండల ఉపాధ్యక్షులు గిరిమూర్తి, ఉలిరాజు, ధనుంజయ, మండల సహాయ కార్యదర్శి పరమేష్, మండల నాయకులు రమేష్, మల్లికార్జున పాల్గొన్నారు.

బదిలీ ఆర్ఐకి సన్మానం

ప్రజాశక్తి - చిప్పగిరి

చిప్పగిరి తహశీల్దార్ కార్యాలయంలో రీసర్వే డిప్యూటీ తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న గుండాల నాయక్‌ను కార్యాలయ సిబ్బంది సన్మానించారు. గుండాల నాయక్‌కు ప్రభుత్వం పదోన్నతి కల్పిస్తూ, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్‌గా ఆలూరుకు బదిలీ చేసింది. బదిలీపై వెళ్తున్న ఆయనను గురువారం తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో సిబ్బంది పూలమాల, శాలువాలతో ఘనంగా సన్మానించారు. తహశీల్దార్ మాట్లాడుతూ... కార్యాలయంలో ప్రతి పనిలోనూ తమకు బాగా సహకరించారని గుండాల నాయక్‌ను ప్రశంసించారు. భవిష్యత్తులో కూడా ఎక్కడికి వెళ్లినా తన పని తాను చేసుకుంటూ మంచి ప్రతిభ కనబరచాలని తెలిపారు. అలాగే మరిన్ని పదోన్నతులు పొంది ముందుకు వెళ్లాలని ఆకాంక్షించారు. సీనియర్ అసిస్టెంట్ మధు స్వామి, విఆర్ఒల బృందం, సర్వేయర్లు, గ్రామ సేవకులు పాల్గొన్నారు.



గుండాల నాయక్‌ను సన్మానిస్తున్న తహశీల్దార్ లక్ష్మీనారాయణ

విద్యార్థులకు 'బయోస్టాడ్' ఆర్థికసాయం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

బయోస్టాడ్ ఇండియా లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేశారు. గురువారం మండలంలోని ఎర్రకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పది మంది పదో తరగతి విద్యార్థులకు రూ.2500 చొప్పున ఉపకార వేతనాలు అందించారు. ఈ సందర్భంగా బయోస్టాడ్ కంపెనీ రీజినల్ మేనేజర్ ఎపి.వరప్రసాద్ మాట్లాడారు. తమకు వచ్చిన లాభాల్లో కొంత భాగాన్ని రైతు కుటుంబాల అభివృద్ధికి వినియోగించాలని దేశమంతటా తాము అందిస్తున్న సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. రైతుల పిల్లలకు ఆర్థిక సహాయం అందించి విద్యాభివృద్ధికి అందరూ ముందుకు రావాలని కోరారు. ప్రధానోపాధ్యాయులు గౌసియా బేగం, ఉపాధ్యాయులు కెఆర్.శ్రీనాథ్ రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు కంపెనీ సేవలను అభినందించారు. సేల్స్ మేనేజర్ టి.వేణుగోపాల్ రెడ్డి, కంపెనీ డీలర్ చిన్నస్వామి పాల్గొన్నారు.



విద్యార్థులకు ఆర్థిక సాయం చేస్తున్న మేనేజర్ వరప్రసాద్

శ్రావణ మాసోత్సవాలు ప్రారంభం

- వైభవంగా ధ్వజారోహణ

ప్రజాశక్తి - కౌతాళం

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రాల్లో ఒకటైన శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి శ్రావణ మాసోత్సవాలను పాలకమండలి ఛైర్మన్ నాగరాజు గౌడ్, దేవాలయ సహాయ కమిషనర్ వాణి ఆధ్వర్యంలో ప్రారంభించారు. గురువారం దేవాలయంలో శ్రావణమాసోత్సవాల సందర్భంగా ధ్వజారోహణ పూజ కార్యక్రమంలో గోపూజ, గణపతి పూజ, ఆలయ శుద్ధి, స్వస్తి పుణ్యాహవచనం పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమం భక్తుల సమక్షంలో వైభవంగా నిర్వహించారు. దేవాలయ ప్రధాన అర్చకులు ఈరప్ప స్వామి, సూపరింటెండెంట్లు వెంకటేష్, రామ్మోహన్, సీనియర్ అసిస్టెంట్ కిరణ్ పాల్గొన్నారు.

రాజగోపురం నిర్మాణానికి విరాళాలు

శ్రీనరసింహ ఉరుకుంద స్వామి రాజగోపురం నిర్మాణానికి విరాళాలు అందజేశారు. తెలంగాణ రాష్ట్రం వనపర్తి పట్టణానికి చెందిన డాక్టర్ నరేష్ కుమార్ కుటుంబ సభ్యులు రూ.1,00,016 చెల్లించినట్లు ముఖ్య అర్చకులు సువర్ణ తెలిపారు. కర్నూలుకు చెందిన రామచంద్ర గౌడ్ రూ.1,01,121 విరాళంగా చెల్లించారు. కర్ణాటకలోని రాయచూరు పట్టణానికి చెందిన విజయ్ కుమార్ రూ.1,00,100 రాజగోపురం నిర్మాణానికి విరాళంగా చెల్లించినట్లు ఉప ప్రధాన అర్చకులు మహదేవస్వామి తెలిపారు.



పూజలు నిర్వహిస్తున్న పాలక మండలి సభ్యులు, అధికారులు

ఖైదీలకు టిబి, హెచ్ఐవిపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - ఆదోని : పట్టణంలోని సబ్ జైలులో జైలర్ నజీర్ అహ్మద్ ఆధ్వర్యంలో గురువారం ఖైదీలకు టిబి, హెచ్ఐవిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌పిహెచ్ఎస్ బాబు రాజు, పిపిఎం సుధాకర్, హెచ్ఐవి కౌన్సిలర్ శివజ్యోతి మాట్లాడారు. రెండు వారాలు మించి దగ్గు, దగ్గులో రక్తపు ఛారలు, ఉదయం, సాయంత్రం జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం తదితర లక్షలు ఉంటే టిబిగా అనుమానించాలని తెలిపారు. తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు మాస్కులు ధరించాలని, పుట్టిన వెంటనే పిల్లలకు బిసిజి వేయించాలని సూచించారు. మనిషికి మనిషికి మధ్య రెండు మీటర్ల దూరం ఉండడం తదితర జాగ్రత్తలు పాటించాలన్నారు. హెచ్ఐవి రాకుండా అపరిచితులతో వివాహేతర సంబంధాలు పెట్టుకోరాదని తెలిపారు. రక్త మార్పిడి నుంచి జాగ్రత్త తీసుకోవాలని, ఒకరు వాడిన సూదులను మరొకరు వాడరాదని, తదితర జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. టిబిహెచ్‌వి కె.లలితమ్మ, ఎల్‌టి యాస్మిన్, సబ్ జైలు సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బాబురాజు

కొత్తపేటలో చోరీ... రికవరీ చేసిన ఎస్ఐ


ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని కొత్తపేట గ్రామంలో బుధవారం షేక్షావలీ ఇంట్లో 3 తులాల బంగారు నగలు, 30 తులాల వెండి కడియాలు, పట్టీలు, రూ.2 వేల నగదును దుండగులు దొంగతనం చేశారు. బాధిత కుటుంబ సభ్యులు ఎస్ఐ భూపాలుడు దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే స్పందించిన ఎస్ఐ గ్రామానికి వెళ్లి సంఘటన జరిగిన ఇంటిని పరిశీలించారు. గ్రామస్తులతో సమావేశం నిర్వహించి డాగ్ స్క్వాడ్‌ను పిలిపించి గ్రామంలో తనిఖీలు నిర్వహిస్తామని హెచ్చరించారు. భయానికి గురైన దుండగుడు రాత్రి 9 గంటల సమయంలో విద్యుత్ పోయినప్పుడు అపహరించిన నగదు, బంగారు, వెండి నగలను ఓ బట్టలో మూటగట్టి బాధితుని ఇంటి ముందు పెట్టి వెళ్లారు. కొంత సమయానికి విద్యుత్ రావడంతో మూటగట్టిన బట్టను బాధిత కుటుంబ సభ్యులు విప్పి చూశారు. చోరీకి గురైన నగదు, బంగారు, వెండి ఆభరణాలు ఉన్నాయని గ్రహించి ఎస్ఐ భూపాలుడుకు వివరించారు. చోరీకి గురైన సొమ్ము రికవరీ కావడంతో గురువారం గ్రామ పెద్ద బాబు, గ్రామస్తులు పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఎస్ఐకి కృతజ్ఞతలు తెలిపారు.

'పంటల నమోదు తప్పనిసరి'

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలో ప్రతి రైతూ పంట నమోదును తప్పనిసరిగా చేసుకోవాలని ఎడిఎ మహ్మద్ ఖాద్రీ, గోనెగండ్ల ఎఒ జి.హేమలత తెలిపారు. గురువారం మండలంలోని ఎర్రబాడు, కున్నూరు, నెరుడుప్పల గ్రామాల్లో పంట నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రైతులు సాగు చేసిన పంటను తప్పనిసరిగా నమోదు చేయాలని తెలిపారు. పంట విస్తీర్ణం, పంట రకం కూడా నమోదు చేయాలని రైతు భరోసా కేంద్రాల ఇన్‌ఛార్జిలను ఆదేశించారు. అనంతరం గ్రామాల్లో సాగు చేసిన పత్తి పంటను పరిశీలించారు. పత్తి పంటను రసం పీల్చేపురుగులు ఆశించినట్లు గుర్తించారు. వీటి నివారణకు డైపెంథురియాన్ 1 గ్రాము లేదా ఇమిడోక్లోప్రైడ్ 0.3 మిల్లీగ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు.



మాట్లాడుతున్న వ్యవసాయ అధికారులు

లోపాల్లేని ఓటర్ల జాబితా కోసం చర్యలు

- సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

- దొంగ ఓట్లు తొలగించాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఆదోని

లోపాలకు ఆస్కారం లేకుండా తుది ఓటర్ల జాబితాను రూపొందించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటామని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలిపారు. గురువారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పెషల్ సమ్మరీ రివిజన్-2024పై తహశీల్దార్ వెంకట లక్ష్మీ, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ అనుపమతో కలిసి అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడారు. ఇంటింటి ఓటర్ల పరిశీలనలో పార్టీలు బూత్ లెవెల్ ఏజెంట్లు భాగస్వామ్యం అయ్యేలా చూడాలని తెలిపారు. ఒకే ఇంటి నెంబర్ మీద 20 ఓట్లు, అంత కంటే ఎక్కువ నమోదైతే వాటిపై ప్రత్యేక శ్రద్ధ వహించి డ్రైవ్ నిర్వహించాలని చెప్పారు. అన్ని అంశాలను సంబంధిత బూత్ లెవెల్ స్థాయి అధికారులతో సంప్రదించి తెలుసుకోవచ్చని రాజకీయ ప్రతినిధులకు సూచించారు. డిసెంబర్ 26 నాటికి పూర్తి చేసి జనవరి 5, 2024న తుది ఓటర్ల జాబితా ప్రచురిస్తామని తెలిపారు.

15 వేల బోగస్ ఓటర్లు

పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో సుమారు 15 వేలకు పైగా బోగస్ ఓట్లు ఉన్నాయని తెలుస్తోందని, వాటిని తొలగించేలా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్ డిమాండ్ చేశారు. కౌన్సిలర్ బాలాజీ మాట్లాడుతూ... కుటుంబంలోనే ఇద్దరు, ముగ్గురు పేర్లు వేరే వార్డుల్లో ఉండడం వల్ల ఓటు హక్కును వినియోగించుకోలేని పరిస్థితి ఉందని తెలిపారు. ఇంటి నెంబర్ వారీగా వరుస క్రమంలో పేర్లు ఉండేలా చూడాలన్నారు. సిపిఐ పట్టణ కార్యదర్శి సుదర్శన్ మాట్లాడుతూ... వార్డులో బిఎల్‌ఒలు పర్యటిస్తున్న సమయం తెలియక సర్వేలో పాల్గొనలేకపోతున్నామని తెలిపారు. మాజీ సర్పంచి గురునాథ్ రెడ్డి మాట్లాడుతూ... ఆదోని మండలం హానవాల్ గ్రామంలో సుమారు 300 ఓట్లు వేరే ప్రాంతం వారివి ఉన్నాయని, తొలగించాలని కోరారు. టిడిపి నాయకులు తిమ్మప్ప మాట్లాడుతూ... వార్డు విభజన సమయాల్లో వరుస క్రమం కాకుండా వేరే ప్రాంతాల వారిని కలిపి జాబితా తయారు చేయడం వల్ల ఓటర్లను కలవలేని పరిస్థితి ఉందని తెలిపారు. రెవెన్యూ వార్డు ప్రకారం జాబితా తయారు చేయాలని కోరారు. మాజీ కౌన్సిలర్ రామలింగేశ్వర యాదవ్ మాట్లాడుతూ... దొంగ ఓట్లను తొలగించాలని దశాబ్ద కాలంగా కోరుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ నాయకులు దేవిశెట్టి ప్రకాష్, నీలకంఠప్ప మాట్లాడుతూ... ఓటరు జాబితాలో పేరు నమోదుపై ప్రజల్లో అవగాహన లేదని తెలిపారు. క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి చైతన్య పరచాలన్నారు. టిడిపి నాయకులు బుద్ధారెడ్డి మాట్లాడుతూ... చనిపోయిన వారి పేర్లు అలానే వస్తున్నాయని, తొలగించాలని కోరినా బిఎల్‌ఒలు పట్టించుకోవడం లేదని తెలిపారు. తుది జాబితాలో లేకుండా చూడాలన్నారు. టిడిపి నాయకులు బాలాజీ, శ్రీనివాసాచారి, జయరాం, చిట్టి, కాంగ్రెస్ నాయకులు దిలీప్, సిపిఐ నాయకులు రాజు, బీఎస్పీ నాయకులు శాంతకుమార్, వైసిపి నాయకులు ప్రసాద్ రావు, మమ్ముత్తి స్వామి, నల్లారెడ్డి, జనసేన నాయకులు తాహెర్ వలీ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మణ్

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

- ఎఒ శివ శంకర్

ప్రజాశక్తి - హాలహర్వి

ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన ప్రతి పంటనూ ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని ఎఒ శివశంకర్ సూచించారు. గురువారం ఆయన హాలహర్వి మండలం గూళ్యం గ్రామం 1, 2, 3 రైతు భరోసా కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సీజన్‌లో వేసిన పంటలను జియో ట్యాగ్ ద్వారా ఈ-క్రాప్ నమోదును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ-క్రాప్ నమోదు చేయకపోతే ప్రభుత్వానికి సంబంధించిన సబ్సిడీలు, రైతు భరోసా, ఇన్సూరెన్స్ వర్తించవని తెలిపారు. ఈ-క్రాప్ నమోదుకు ప్రతి రైతూ సహకరించాలని కోరారు. ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన ప్రతి రైతూ ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా, పట్టాదారు పాసు పుస్తకం, సర్వే నెంబర్లు తదితర వివరాలు ఈ-క్రాప్ యాప్‌లో పొందుపరుస్తారని తెలిపారు. దీని వల్ల ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పంటల బీమా వర్తిస్తుందన్నారు. ప్రభుత్వం అందించే రైతు పథకాలు పొందాలంటే తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని సూచించారు. విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ మనోజ్ పాల్గొన్నారు.



పంట నమోదును పరిశీలిస్తున్న ఎఒ శివ శంకర్



అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న నాయకులు

అవార్డు గ్రహీతలకు సన్మానం

ప్రజాశక్తి - కోసిగి

ఈనెల 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ ప్రతిభ అవార్డులు అందుకున్న తహశీల్దార్ రుద్ర గౌడ్, వందగల్లు విఆర్ఒ బసవరాజును గురువారం వీరశైవ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. ఆర్లబండ సహకార సంఘం మాజీ అధ్యక్షులు మఠం మాంతేష్ స్వామి, వైసిపి యువజన విభాగం జిల్లా నాయకులు మఠం జగదీష్ స్వామి, టీచర్ రాజమౌళి, బుక్కిటి వీరేశ్, రమేష్, చంద్రమౌళి, గుడికల్ రమేష్, వైసిపి నేలకోసిగి నాయకులు పశువుల లక్ష్మన్న, చాకలి వేమారెడ్డి, హరిజన ఈరన్న పాల్గొన్నారు.

తాగునీటి కోసం ట్రాన్స్‌ఫార్మర్



ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

ప్రజాశక్తి - కోసిగి

తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సహకారంతో దుద్ది చెరువు దగ్గర ఉన్న నీటి బోర్లకు కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినట్లు కోసిగి మేజర్ పంచాయతీ సర్పంచి ఎస్.అయ్యమ్మ తెలిపారు. గురువారం ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి నీటి బోర్లకు కనెక్షన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గతంలో లోవోల్టేజీ సమస్య వల్ల నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడేదని తెలిపారు. సమస్యను ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు కృషి చేశారని చెప్పారు. గ్రామంలో నీటి సరఫరాను పూర్తిస్థాయిలో అందిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, మండల ఇన్‌ఛార్జీ మురళీమోహన్ రెడ్డి సహాయ, సహకారాలతో గ్రామాన్ని మరింత అభివృద్ధి బాటలో నడపడానికి కృషి చేస్తామని చెప్పారు. వైసిపి యువ నాయకులు రాజేష్, పంచాయతీ సిబ్బంది హుస్సేని, నరసప్ప, రామకృష్ణ, మధు, బాష, గోవిందు, చిన్న నరసింహులు, రాము పాల్గొన్నారు.

విఆర్ఒ చేయి కొరికిన అర్జీదారుడు


దేవనకొండ : మండలంలోని పి.కోటకొండ విఆర్ఒ షేకన్న చేయిని ఓ అర్జీదారుడు కొరికిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. ఈ విషయంపై విఆర్ఒను ప్రశ్నించగా... దుప్పనగుర్తి గ్రామానికి చెందిన కురువ హనుమన్న అనే వ్యక్తి మాదాసి కురువ (ఎస్సీ) సర్టిఫికెట్ కావాలని అర్జీ రూపంలో అడుగగా విచారణ చేసి రెండు రోజుల్లో చెబుతానని అన్నట్లు తెలిపారు. అక్కడే ఉన్న మరో వ్యక్తి వీడియో తీస్తుండగా 'ఎందుకు వీడియో తీస్తున్నావ్' అని ప్రశ్నించడంతో హనుమన్న చేయి కొరికినట్లు చెప్పారు. ఈ విషయంపై స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

జర్నలిస్టుల సేవలు మరువరానివి

- డిప్యూటీ డిఎంహెచ్ఒ రఘురామిరెడ్డి


ప్రజాశక్తి - ఆస్పరి

ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టులు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పని చేస్తూ ప్రజల కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ రఘురామిరెడ్డి తెలిపారు. గురువారం ఎపియుడబ్ల్యుజె ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఎపియుడబ్ల్యుజె మండల అధ్యక్షులు శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ రఘురామిరెడ్డి, డాక్టర్లు మాధవీలత, దుర్గాబాయి చేతులమీదుగా రోగులు, బాలింతలు, గర్భిణులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఎపియుడబ్ల్యుజె జిల్లా నాయకులు నాగన్న, మండల కార్యదర్శి మురళీ, సీనియర్ పాత్రికేయులు తిమ్మన్న, సంజన్న, శ్రీనివాసులు పాల్గొన్నారు.



రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న రఘురామిరెడ్డి

మహారాజశ్రీ దరిశి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఐ.ఎ.నెం.906/22
ఇన్
ఒ.ఎస్.నెం.4/2003
దేవినేని నరసమ్మ (డైడ్) వగైరా....వాద్లు/పిటీషనర్స్
వర్సెస్
కటికల నాగేశ్వరరావు వగైరా
...ప్రతివాద్లు/రెస్పాండెంట్స్
టు,
ఆర్13) గాదెరాజు ఖాదరమ్మ భర్త సుబ్బరాజు, ఎస్.ఒ.సి. క్యాంప్ ఆఫీసు, విఘ్నేశ్వర టెంపుల్, మంగళగిరి టౌన్, గుంటూరు జిల్లా.
ఆర్ 14) బడబాగ్ని వెంకట సుబ్బమ్మ భర్త సంజీవరాజు,ఆర్/ఒ. పెద్దభోదన గ్రామం, చాగలమర్రి మండలం, కర్నూలు జిల్లా.
పై నెంబరు దావాలో మీకు నోటీసులు ఈ కోర్టు వారు పలుమార్లు పంపినప్పటికి మీరు తీసుకొనకపోవుట వలన శ్రీ కోర్టు వారు నోటీసు నిమిత్తం ఆర్డరు వేసి ఉన్నారు. కావున మీ హాజరు నిమిత్తం తేది 28-08-2023 న వాయిదా ఉన్నది. ఆ రోజు ఉదయం గం॥ 10-30 ని॥లకు మీరు స్వయంగా గాని లేదా లాయరు ద్వారా గాని పై కోర్టునకు హాజరు కావలసినదిగా కోరుచున్నాము. లేనిచో మీ పరోక్షమున దావాను తీర్మానించబడునని తెలియ చేయడమైనది.
// శ్రీకోర్టు వారి అనుమతితో //
వాయిదా తేది : 28.08.2023
ఇట్లు
వి.రంగా, బి.ఎ.,బి.ఎల్.,
అడ్వకేట్,
దరిశి, ప్రకాశం జిల్లా.
సెల్ : 9849567355



ఉ(ఎ)త్తిపోతలు

- నిరుపయోగంగా 'సంగమేశ్వరం, శివపురం' పథకాలు
- చెంతనే కృష్ణమ్మ.. ఎండుతున్న పంటలు
- నిర్లక్ష్యంలో అధికారులు, కమిటీ సభ్యులు - నీటి కోసం ఎదురుచూస్తున్న రైతులు



సంగమేశ్వరం, శివపురం ఎత్తిపోతల పథకాలు

ప్రజాశక్తి - కొత్తపల్లి

గ్రామీణ ప్రాంతాల రైతుల బీడు భూములను సస్యశ్యామలం చేసేందుకు ప్రభుత్వాలు కోట్లాది రూపాయలతో ఎత్తిపోతల పథకాలను మంజూరు చేశాయి. కొత్తపల్లి మండలంలోని ముసలమడుగు గ్రామ శివారులో అప్పటి ప్రభుత్వం శివపురం, సంగమేశ్వరం ఎత్తిపోతల పథకాలను నిర్మించారు. రైతులకు ఉపయోగపడకుండా నిరుపయోగంగానే ఉన్నాయి. చెంతనే కృష్ణమ్మ ఉన్నా రైతుల పొలాలు ఎండిపోతున్న పరిస్థితి మండలంలో నెలకొంది. ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెబుతున్నా ఆచరణంలో మాత్రం శూన్యం.

కొత్తపల్లి మండలం ముసలమడుగు గ్రామ శివారులో అప్పటి ప్రభుత్వం రూ.25.26 కోట్లతో శివపురం, రూ.36.49 కోట్ల నిధులతో సంగమేశ్వరం ఎత్తిపోతల పథకాలను నిర్మించారు. ఈ రెండు ఎత్తిపోతల పథకాల కింద 8500 ఎకరాలకు సాగునీరు అందించాలి. కొత్తపల్లి, శివపురం, గుమ్మడాపురం, ముసలమడుగు, ఎర్రమఠం, మాడుగుల గ్రామాల్లో ఉన్న రైతులకు సాగునీరు అందించాల్సి ఉంది. శివపురం ఎత్తిపోతల పథకం కింద 2405 మంది రైతులకు, సంగమేశ్వరం ఎత్తిపోతల పథకం కింద 3255 మంది రైతుల పొలాలకు సాగునీరు అందించాల్సి ఉంది. ఎత్తిపోతల పథకాల సమీపంలోనే పుష్కలంగా కృష్ణమ్మ ఉన్నప్పటికీ అధికారుల అలసత్వం, కమిటీ సభ్యుల నిర్వహణ సరిగ్గా లేక ఎత్తిపోతల పథకాల నుంచి ఇప్పటికీ సాగునీరు సక్రమంగా వదలడం లేదు. ప్రతి సంవత్సరం ఎత్తిపోతల పథకాల మోటార్లను రిపేరీల పేర్లతో రైతులకు సాగునీరు అందించకుండా కాలయాపన చేస్తున్నారు. గత సంవత్సరం శివపురం ఎత్తిపోతల పథకం మోటార్లను మరమ్మతులు చేసినప్పటికీ నేటికీ పొలాలకు సాగునీరు వదలలేదు. సంగమేశ్వరం ఎత్తిపోతల పథకం మోటార్ల మరమ్మతుల కోసం కమిటీ సభ్యులు అందరూ కలిసి మరమ్మతులు చేయించాలని కొంత డబ్బు సమకూర్చినప్పటికీ ఖర్చు రెట్టింపు అవుతుండడంతో సాగునీరు వదలడం ఆలస్యం అయ్యే అవకాశం ఉంది. ఎత్తిపోతల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన వ్యక్తులు ఉన్నప్పటికీ మోటార్లకు ఉన్న సామాగ్రి, కరెంటు తీగలను దొంగిలించుకుపోతున్న సంఘటనలు ఉన్నాయి. పెద్ద గుమ్మడాపురం గ్రామంలో మొక్కజొన్న, పత్తి పంటలకు సరైన సమయంలో నీరు లేక సుమారు 20 మంది రైతులు ట్రాక్టర్ల ద్వారా పంటలను చెడగొట్టారు. మిగతా గ్రామాల్లో కూడా చాలామంది రైతుల పరిస్థితి ఇలాగే ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారుల స్పందించి శివపురం, సంగమేశ్వరం ఎత్తిపోతల పథకాల నుంచి సాగునీరు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

అధికారులు స్పందించి రైతులకు సాగునీరు ఇవ్వాలి



శివపురం, సంగమేశ్వరం ఎత్తిపోతల పథకాల నుంచి సకాలంలో సాగునీరు అందించాలి. రైతుల పొలాలు సాగునీరు లేక ఎండిపోతున్నాయి. ప్రతి సంవత్సరం ఎత్తిపోతల పథకాల నుంచి ఆలస్యంగా సాగునీరు అందిస్తున్నారు. సరైన సమయంలో రైతులకు సాగునీరు ఇస్తే రైతుల పొలాలు సస్యశ్యామలం అవుతాయి. పంట ఎండిపోతున్న అధికారులు నిర్లక్ష్య ధోరణి వహిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి సకాలంలో రైతులకు సాగునీరు అందించాలి.


- రైతు సంఘం నాయకులు సంజీవ రాయుడు.

పంటలకు నీరు లేక చెడగొట్టాం



గ్రామంలో కౌలుకు పొలం తీసుకొని మొక్కజొన్న పంట వర్షాలకు వేశాను. అయితే వర్షాలు రాకపోగా ఎత్తిపోతల నుంచి సాగునీరు వదలకపోవడంతో మొక్కజొన్న పంట ఎండి పోవడంతో పంట చెడగొట్టాను. ఈ ఏడాది 4 ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకొని ఎకరా రూ. 15 వేల చొప్పున 4 ఎకరాలకు రూ. 30 వేలు ముందుగానే చెల్లించాను. మొక్కజొన్న ఎకరాకు ఇప్పటికే రూ. 10 నుంచి రూ. 15 వేలు ఖర్చు చేశాం. 2 ఎకరాల్లో వేసిన మొక్కజొన్న పంటను పూర్తిగా చెడగొట్టడంతో దాదాపు రూ. 70 వేల వరకు నష్టం వాటిల్లింది.

- కౌలు రైతు గోపాల్, పెద్ద గుమ్మడాపురం.



అప్రకటిత కోతలు

- లోడ్ రిలీఫ్ పేరుతో విద్యుత్ నిలిపివేత - చీకట్లో అల్లాడుతున్న ప్రజలు

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

జిల్లాలో అప్రకటిత విద్యుత్ కోతలు మొదలయ్యాయి. లోడ్ రిలీఫ్ పేరుతో విద్యుత్ కోత పెడుతుండటంతో ప్రజలు చీకట్లో గడపాల్సి వస్తోంది. ఎడా పెడా విద్యుత్తు కోతలతో గ్రామీణులు అల్లాడుతున్నారు. సాయంత్రం వేళల్లో కోతలు విధిస్తుండటంతో పలు గ్రామాల్లో ప్రజలు సబ్ స్టేషన్లను ముట్టడిస్తున్నారు...

ఉమ్మడి జిల్లాలో అప్రకటిత విద్యుత్తు కోతలు పెరిగిపోయాయి. రాత్రి వేళ కరెంట్ ఎప్పుడు ఉంటుందో ఎప్పుడు నిలిపివేస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. డిమాండ్ మేరకు ఉత్పత్తి లేకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో ఇష్టాను సారం సరఫరా ఆపేస్తున్నారు. అత్యంవసర లోడ్ రిలీఫ్ పేరిట గంటల తరబడి కోతలు విధిస్తుండటంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. నిద్రలేని రాత్రిళ్లు గడపాల్సి వస్తోందని గ్రామీణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో సాధారణంగా 13 నుంచి 14 మిలి యన్ యూనిట్ల విద్యుత్తు వినియోగం జరుగుతోంది. 640 మెగా వాట్ల డిమాండ్ ఉంటోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వారం రోజుల క్రితం వరకూ 50 మెగావాట్ల విద్యుత్ లోటు ఉండగా అది ఇప్పుడు 60 మెగావాట్లకు పెరిగింది. వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలు గడిచినా ఆశించినంత వర్షపాతం నమోదు కాలేదు. గత నెలలో మూడు రోజుల పాటు కురిసిన వర్షాలు మినహా ఉమ్మడి జిల్లాలో ఎక్కడా భారీ వర్షాలు కురవలేదు. ఇదే సమయంలో ఎండల తీవ్రత కూడా అధికంగానే ఉంది. దీంతో ప్రస్తుతం జిల్లాలో విద్యుత్తు వియోగం వేసవిలో ఉన్నట్లే ఉంది. సాయంత్రం 6 గంటల నుంచి గృహ, వాణిజ్య వినియోగం ఎక్కు వగా ఉంటోంది. కర్నూలు, నంద్యాల జిల్లాల పరిధిలో సాయంత్రం 7.30 నుంచి అర్ధరాత్రి 12 గంటల మధ్య 750 మెగావాట్ల డిమాండ్ ఉన్నట్లు విద్యుత్తు శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ సమయంలోనే సరఫరా లోటు ఏర్పడి గ్రామాల్లో కోతలకు కారణం అవుతోంది. విద్యుత్తు లోటు పెరుగు తుండటంతో నంద్యాల జిల్లాలోని సిమెంటు పరిశ్రమలపై విద్యుత్తు శాఖ ఆంక్షలు పెట్టింది. పాణ్యం, జేఎస్ డబ్ల్యూ తదితర సిమెంటు కర్మాగారాలతో పాటు భారీ పరిశ్రమలు సాయంత్రం 6 గంటల నుంచి విద్యుత్తు వినియోగాన్ని పూర్తిస్థాయిలో తగ్గించాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. లోటు ఇలాగే కొనసాగితే ఈ పరిశ్రమలకు సాయంత్రం నుంచి రాత్రి వరకు సరఫరా నిలిపివేసే అవకాశాలనూ అధికారులు పరిశీలిస్తు న్నారు. ఎడా పెడా విద్యుత్తు కోతలతో గ్రామీణులు అల్లాడుతున్నారు. సాయంత్రం వేళల్లో కోతలు విధిస్తుండటంతో పలు గ్రామాల్లో ప్రజలు సబ్ స్టేషన్లను ముట్టడిస్తున్నారు.

మెరుగైన సేవలు అందించాలి

- డిఎంహెచ్ఒ డాక్టర్ వెంకటరమణ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

మాతా శిశు మరణాలు సంభవించకుండా గర్భిణులకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఆర్.వెంకటరమణ సూచించారు. గురువారం మహిళా ప్రాంగణంలో నూతనంగా నియ మితులైన ఆశా కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు మాతా శిశు సంరక్షణలో మెరుగైన సేవలు అందించాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పులు జరిగేల ప్రోత్సహించాలని సూచించారు. ఆశా కార్యకర్తల నిశ్చయి కిట్‌లు అందుబాటులో ఉంచు కోవాలని, సందర్శన చేసినప్పుడు గర్భిణు లను గుర్తించి టీడీ ఇంజెక్షన్‌లు వేయించాలని తెలిపారు. కార్యక్రమంలో శిక్షకులు ప్రతిభ, ఆరోగ్య భోదకురాలు స్వర్ణ గౌరీ, హెచ్ఎస్ సరళ గంగ, డిసిఎం వీరన్న తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిఎంహెచ్ఓ

తెలుగు గంగ గేటు ఎత్తివేత

- నీటి విడుదల చేసిన నంద్యాల ఎంపీ, శ్రీశైలం ఎమ్మెల్యే
- హంద్రీనీవాకు నీటి విడుదల చేసిన నందికొట్కూరు ఎమ్మెల్యే

ప్రజాశక్తి - వెలుగోడు

వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (విబిఆర్) మద్రాస్ కాలువ ఒక గేటును ఎత్తి వేయి క్యూసెక్కుల నీటిని ఎథిక్స్ కమిటీ చైర్మన్,



తెలుగు గంగ గేటు ఎత్తి దిగువకు నీటి విడుదల చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి, ఎంపీ పోచ బ్రహ్మానంద రెడ్డి కిందకు గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వెలుగోడు, బండి ఆత్మకూరు, మహానంది, ఆళ్లగడ్డ ఆపై ప్రాంతాలవారికీ రైతన్నల సాగు కోసం నీటిని విడుదల చేయడం జరిగిందని పేర్కొన్నారు. సరైన సమయంలో ప్రాజెక్టు నుండి రైతుల సాగు కోసం నీటిని విడుదల చేసినందుకు రైతన్నలు ఆనందం వ్యక్తం చేసి, కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీశైలం నియోజకవర్గం సమన్వయకర్త శిల్పా భువనేశ్వర్ రెడ్డి, తెలుగు గంగ అధికారులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, రైతులు పాల్గొన్నారు.

హంద్రీనీవాకు నీటి విడుదల చేసిన ఎమ్మెల్యే ఆర్థర్

నందికొట్కూరు : నందికొట్కూరు మండలంలోని మల్యాల ఎత్తిపోతల హంద్రీనీవా సుజల స్రవంతి పథకం నుంచి కెసి కాలువకు, హంద్రీనీవా కాలువకు బుధవారం జలవనరుల శాఖ అధికారుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే తోగూర్ ఆర్థర్ రెండు పంపుల ద్వారా నీటిని విడుదల చేశారు. 700 క్యూసెక్కుల నీటిని కర్నూలు, నంద్యాల, చిత్తూరు, అనంతపురం జిల్లా ప్రజల సాగు తాగునీటి అవసరాల కోసం విడుదల చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నదాతల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందన్నారు. శ్రీశైలం జలాశయంలో 863 అడుగులకు నీటిమట్టం చేరుకోగానే హంద్రీనీవా నుంచి నీటి విడుదల చేశామన్నారు. ప్రతి ఏడాది హంద్రీనీవా నుంచి 40 టిఎంసిల నీటిని సరఫరా చేస్తున్నారన్నారు.



మల్యాల ఎత్తిపోతల నుంచి హంద్రీనీవా కాల్వకు విడుదలవుతున్న నీరు



ఎస్పికి పూల బొకే ఇచ్చి అభినందిస్తున్న రెడ్ క్రాస్ చైర్మన్

ఎస్పికి రెడ్‌క్రాస్ సొసైటీ అభినందనలు

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

ప్రతిష్టాత్మక ఇండియన్ పోలీస్ మెడల్ అందుకున్న నంద్యాల జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డిని గురువారం రెడ్ క్రాస్ చైర్మన్, వైస్ చైర్మన్లు కలిసి పూల బొకే అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పి మరెన్నో అవార్డులు, సేవా పతకాలు అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ దస్తగిరి పర్ల, వైస్ చైర్మన్ మారుతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల ప్రిన్సిపల్‌కు సన్మానం

ప్రజాశక్తి - పాణ్యం

ఉత్తమ సేవ పురస్కారం అందుకున్న పాణ్యం గిరిజన బాలుర గురుకుల రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపల్ జె.కృష్ణనాయక్‌ను గురువారం పాఠశాల ఆవరణంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పిఇటి ఆంజనేయులు, వైస్ ప్రిన్సిపల్ జీవ రత్నమ్మ, హేమలత, మహేశ్వరమ్మ, నాగరాణి, గౌసియ్య, బాలకృష్ణ, జేఆర్ నాయక్, రామిరెడ్డి, చెన్నకేశవ, హాస్టల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు

బాలుడికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

మండలంలోని హనుమంతుగుండం గ్రామానికి చెందిన నరసింహరాజు కుమారుడు నాగేష్‌కు మాజీ ఎమ్మెల్యే బిసి జనార్ధన్ రెడ్డి సతీమని బిసి ఇందిరా రెడ్డి గురువారం ఆర్థికసాయం అందజేశారు. బాలుడు మొహర్రం రోజున ప్రమాదవశాత్తు గుండంలో పడి గాయాలయ్యాయి. విషయం తెలిసిన ఆమె వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు శివరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న బిసి ఇందిర

అంగన్వాడీలకు వేతనాలు పెంచాలి

- సిఐటియు, అంగన్‌వాడీ యూనియన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వినతి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

అంగన్వాడీలకు తెలంగాణా కన్నా అదనంగా వేతనాలు పెంచాలని, గ్రాట్యూటీ అమలు చెయ్యాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం.నిర్మల, నాయకురాలు అర్బన్ ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు నాగరాణి, సునీతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వారు ఎమ్మెల్యే రవి చంద్ర కిషోర్ రెడ్డిని కలిసి గురువారం వినతిపత్రం అందజేశారు. రాబోయే అసెంబ్లీ సమావేశాలలో ప్రస్తావించాలని కోరారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ కాలంలో ప్రభుత్వ విధానాల వల్ల పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యవసర వస్తువుల ధరలు అనేక రెట్లు పెరిగాయని, కానీ అందుకు అనుగుణంగా వేతనాలు పెంచలేదన్నారు. తెలంగాణాలో 2021 జూలై నుండి వర్కర్లకు రూ.13,650లు, హెల్పర్, మినీ వర్కర్లకు రూ.7,800 ఇస్తున్నారని, మన రాష్ట్రంలో అంగన్వాడీలకు వేతనాలు పెంచలేదని, సంక్షేమ పథకాలు కూడా ఇవ్వడంలేదన్నారు. సెంటర్ల నిర్వహణకు అంగన్వాడీలు పెట్టుబడులు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. 2017 నుండి టిఎ బిల్లులు ఇవ్వడం లేదని చెప్పారు. 2022 ఏప్రిల్ 25 అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు అంగన్వాడీలకు గ్రాట్యూటీ అమలు చెయ్యమని చెప్పిన తీర్పు ఇంత వరకు అమలు చేయలేదన్నారు. రకరకాల యాప్‌లు తెచ్చి పని భారం పెంచారన్నారు. అంగన్వాడీ కేంద్రాలను పర్యవేక్షణ పేరుతో అధికారులు, రాజకీయ నాయకులు విజిట్ల పేరుతో అంగన్వాడీలను అవమానిస్తూ, వేధింపులకు గురి చేస్తున్నారని అన్నారు. ప్రకాశం జిల్లా టంగుటూరు ప్రాజెక్టులోని హనుమాయమ్మను రాజకీయ కక్షలతో నిర్ధాక్షిణ్యంగా చంపారని, కనీసం మట్టి ఖర్చులు ఇచ్చే దిక్కు కూడా లేదన్నారు. ఈ నేపథ్యంలో అంగన్వాడీల సమస్యలు అసెంబ్లీ సమావేశాల సందర్భంగా చర్చించి పరిష్కారం చెయ్యాలని కోరారు.



ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇస్తున్న సిఐటియు, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు



భవిష్యత్తు గ్యారెంటీ బుక్‌లెట్లను పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి

భవిష్యత్తు కోసం టిడిపిని గెలిపించాలి : మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె

రాష్ట్ర భవిష్యత్తు కోసం, నిరుద్యోగ యువకుల ఉద్యోగాల కోసం టిడిపిని గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి కోరారు. గురువారం మండలంలోని రామతీర్థం గ్రామంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం మూడవ రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి భవిష్యత్తు గ్యారెంటీలో భాగంగా టిడిపి ఇచ్చిన హామీలపై బుక్‌లెట్‌లను పంపిణీ చేశారు. 2024 ఎన్నికల్లో టిడిపిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి అంబాల రామ కృష్ణారెడ్డి, బనగానపల్లె ఉప సర్పంచి బురానుద్దీన్, నియోజకవర్గం ముస్లిం మైనారిటీ అధ్యక్షులు రాయలసీమ సలాం, టిడిపి నాయకులు తలారి మద్దిలేటి, తలారి బాలనాయుడు, తలారి మధు ప్రతాప్ నాయుడు, రామయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **కొలిమిగుండ్ల :** రాష్ట్ర భవిష్యత్తు తెలుగుదేశం పార్టీతోనే అని, అందుకు గ్యారెంటీ చంద్రబాబు నాయుడు వల్లనే సాధ్యమవుతుందని బనగానపల్లె మాజీ శాసనసభ్యులు బీసీ జనార్ధన రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ అన్నారు. కొలిమిగుండ్ల మండలం ఎర్రగుడి గ్రామంలో మహాశక్తి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్ళి తెలుగుదేశం పార్టీ ప్రకటించిన సంక్షేమ పథకాలను ప్రజలకు ఆమె వివరించారు. రాబోయే ఎన్నికలలో తెలుగుదేశం పార్టీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి ప్రచార కార్యదర్శి శివరామిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోట కందుకూరులో పోటాపోటీగా ప్రచారం

- ఒకవైపు ఎమ్మెల్యే, మరొక వైపు మాజీ మంత్రి
- ఓటర్లను ప్రసన్నం చేసుకునే దిశగా అభ్యర్థులు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

మండలంలోని కోట(పెద్ద) కందుకూరు గ్రామంలో సర్పంచ్ ఉప ఎన్నికను టిడిపి, వైసిపిలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. తాము బలపరిచే అభ్యర్థులను గెలిపించాలని, కోట కందుకూరు అభివృద్ధి మాతోనే అని ఒకవైపు మాజీ మంత్రి భూమా అఖిలప్రియ, మరోవైపు ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్ర రెడ్డిలు గురువారం గ్రామంలో పోటాపోటీగా ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి తాము బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. వైసిపి బలపరిచిన అభ్యర్థి నల్లజన లక్ష్మీదేవి గంప గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే గంగుల నాని ఓటర్లను అభ్యర్థించారు. మరొకవైపు టిడిపి బలపరిచిన అభ్యర్థి ఆర్ల నాగ శ్రీనివాసులు కత్తెర గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ ఓటర్లను కోరారు. ఇది ఇలా ఉండగా మరో ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులు బరిలో ఉండడం గమనార్హం. రెండు ప్రధాన పార్టీలు తాము బలపరిచిన అభ్యర్థులను గెలిపించేందుకు, గ్రామంలో పట్టు నిలుపుకునేందుకు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నాయి. గెలుపు కోసం ఇరుపార్టీలు తమ వ్యూహాలను సిద్ధం చేస్తున్నాయి. ప్రచారానికి గురువారం చివరి రోజు కావడంతో అభ్యర్థులు విస్తత ప్రచారం నిర్వహించారు. ఓటర్లు ఎవరినీ గెలిపిస్తారన్నది తెలియాలంటే ఈనెల 19 వరకు వేచి చూడాల్సిందే.



ప్రచారం నిర్వహిస్తున్న మాజీ మంత్రి భూమా అఖిలప్రియ



ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రా రెడ్డి

నేడు ప్రభుత్వ ఉద్యోగుల గ్రీవెన్స్ డే

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : నేడు కలెక్టర్ ఛాంబర్‌లో ఉద్యోగుల గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన సమస్యలపై దరఖాస్తులతో నేడు ఉదయం 10-30 నుండి మధ్యాహ్నం 1-30 వరకు తన ఛాంబర్‌లో సంప్రదించాలని తెలిపారు. ప్రతి ఉద్యోగి తన దరఖాస్తులో సిఎఫ్ఎంఎస్ ఐడి తప్పనిసరిగా వేయాలని సూచించారు.

సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి - పాణ్యం : 2014 జూన్ 2 కంటే ముందు పని చేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులర్ చేసిన సందర్భంగా గురువారం స్థానిక జూనియర్ కళాశాలలో పని చేస్తున్న నూర్జహాన్, దాక్షాయణిలు సిఎం జగన్ ఫోటోకు పాలాభిషేకం చేశారు. జగనన్నకు ధన్యవాదాలు తెలియజేశారు.

చెంచుగూడెంలో దోమల నివారణ మందు పిచికారి

ప్రజాశక్తి - రుద్రవరం : మండలంలోని చిన్నయ్య స్వామి చెంచుగూడెంలో దోమల నివారణ మందులు పిచికారి చేసినట్లు డాక్టర్ ప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ రెండో విడతగా 50 శాతం దోమలు నివారించేందుకు డిడిటి మందును స్ప్రేయింగ్ చేయించా మన్నారు. దీని ద్వారా మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను నివారించేందుకు ఈ మందు ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు, సబ్ యూనిట్ అధికారి శివచంద్రారెడ్డి, ఎంపీహెచ్ఓ నాగప్రసాద్, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

స్వామి రెడ్డి ఆశయాలను సాధించాలి : సిపిఐ

ప్రజాశక్తి - నంద్యాల

స్వాతంత్ర సమరయోధులు, ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యదర్శి యాలూరి స్వామి రెడ్డి ఆశయాలను సాధించాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. బాబా ఫక్రుద్దీన్, పట్టణ కార్యదర్శి కే ప్రసాద్ అన్నారు. గురువారం స్వామి రెడ్డి 42వ వర్ధంతి సందర్భంగా నంద్యాల పట్టణ సమితి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. సిపిఐ, ఇన్సాఫ్, వ్యకాసం నాయకులు పాల్గొన్నారు.

చౌడేశ్వరి దేవస్థానంలో బియ్యం వేలం

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని నందవరం చౌడేశ్వరి దేవస్థానంలో లావుబియ్యం, పులగం బియ్యంలకు వేలంపాటలను దేవదాయ శాఖ ఇన్స్పెక్టర్ హరి చంద్ర రెడ్డి, ఆలయ ఈవో రామానుజన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ వేలంలో అహెూబిలం గ్రామానికి చెందిన నాగశేషుడు కేజీ లావు బియ్యం రూ.26.50, కేజీ పులగం బియ్యం రూ.30.50లకు అధికంగా పాట పాడినట్లు ఈవో రామానుజన్ తెలిపారు.


ప్రమాణ స్వీకారం చేస్తున్న లక్ష్మీకాంతరెడ్డి

సింగిల్‌విండో చైర్మన్‌గా లక్ష్మీకాంతరెడ్డి ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి- నందికొట్కూర్ టౌన్

నందికొట్కూరు మండల వ్యవసాయ సహకార పరపతి సొసైటీ నూతన చైర్మన్, డైరెక్టర్లను ప్రభుత్వం నియమించిన నేపథ్యంలో గురువారం సొసైటీ చైర్మన్ లక్ష్మీకాంత రెడ్డి, డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్ సుధాకర్ రెడ్డి, మండల అధ్యక్షుడు మురళి కృష్ణారెడ్డి, బన్నూరు సింగిల్ విండో చైర్మన్ వైవి రమణ, వైసీపీ యువజన విభాగం నాయకులు చంద్రమౌళి, వైసిపి నాయకులు బద్దుల శ్రీకాంత్, బిజినవేముల సర్పంచ్ రవి యాదవ్‌లు హాజరయ్యారు. అనంతరం సొసైటీ సీఈవో రబ్బాని సొసైటీ చైర్మన్గా ఎంపికైన లక్ష్మి కాంతారెడ్డి, డైరెక్టర్లు మధు, సవారయ్యలచే సీఈవో రబ్బాని ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ దాస్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం సహకార పరపతి సొసైటీ చైర్మన్, డైరెక్టర్లు కృషి చేయాలని వారికి సూచించారు. మున్సిపల్ కౌన్సిలర్స్ లాలూ ప్రసాద్, రాహుఫ్, వైసీపీ బీసీ సంఘం రాష్ట్ర నాయకులు కాలూరి శివప్రసాద్, నాయకులు మార్కెట్ రాజు, వార్డు ఇన్చార్జులు మందాడి రవీంద్రారెడ్డి, పి రమేష్, బ్రహ్మయ్య చారి, శాలి బాష, తదితరులు పాల్గొన్నారు.

విఆర్ఎ మృతి

ప్రజాశక్తి - చాగలమర్రి

చాగలమర్రి పట్టణానికి చెందిన తలారి మహబూబ్‌బాష(34) అనారోగ్యంతో గురువారం తెల్లవారు జామున మృతి చెందాడు. తలారి మృతికి తహసీల్దారు సుభద్రమ్మ,డిటి విజయ్ కుమార్, విఆర్ఓలు శ్రీనివాసులు, శారద,విశ్వనాధ్, తలారుల సంఘం అధ్యక్షుడు అబ్దుల్ గఫార్‌లు తమ ప్రగాడ సంతాపం తెలియజేసారు. తక్షణ ప్రభుత్వ సహాయం క్రింద రూ. 25 వేలు, తలారుల సంఘం తరుపున రూ. 12 వేలను తహశీల్దార్ సుభద్రమ్మ కుటుంబ సభ్యులకు అందజేసారు. అలాగే వైసిపి రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి బాబులాల్,మండల కన్వీనర్ కుమార్ రెడ్డి లు తలారి మహబూబ్‌బాష మృతదేహంపై పూలమాల వేసి, మృతుడి కుటుంబ సభ్యులకు తమ ప్రగాడ సానుభూతి వ్యక్తం చేసారు. సంతాపం తెలిపిన వారిలో వైసీపీ నాయకులు జిల్లా సేవాదల్ అధ్యక్షుడు గణేష్‌రెడ్డి, వైసిపి నాయకులు వెంకటరమణ, ఖాధర్ బాష,తలారులు నరసింహ, వేణు, ఆనంద్ తదితరులు ఉన్నారు.


ప్రభుత్వ సహాయాన్ని అందజేస్తున్న తహసిల్దార్ సుభద్రమ్మ

దేవాలయాల అభివృద్ధికి సిఎం కృషి

- ప్రభుత్వ సలహాదారుడు జ్వాలాపురం శ్రీకాంత్

ప్రజాశక్తి - పాములపాడు

దేవాలయాల అభివృద్ధికి, పటిష్టతకు ముఖ్యమంత్రి ఎంతో కృషి చేస్తున్నారని దేవాదాయ ధర్మాదాయ శాఖ ప్రభుత్వ సలహాదారుడు జ్వాలాపురం శ్రీకాంత్ అన్నారు. గురువారం నాడు పాములపాడు మండలం బానకచెర్ల గ్రామంలో శ్రీ శివ సీతారామాలయం దేవాదాయ శాఖ లో విలీనం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జ్వాలాపురం శ్రీకాంత్ హాజరయ్యారు. పారిశ్రామికవేత్త, కొమెసా చైర్మన్ ఆవుల వెంకటనారాయణ రెడ్డి, బానకచెర్ల సర్పంచ్ ఆవుల జయసుధ దంపతులు గత ఏడు సంవత్సరాల క్రితం శివ రామాలయాన్ని రూ.60 లక్షలు ఖర్చుతో నిర్మించారు. ఈ దేవాలయాన్ని దేవాలయ శాఖలోకి విలీనం కావడంతో ఆవుల వెంకటనారాయణ రెడ్డి, సర్పంచ్ జయసుధ గ్రామ పెద్దల సమక్షంలో విలీన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దేవాదాయ ధర్మాదాయ శాఖ ప్రభుత్వ సలహాదారులు జ్వాలాపురం శ్రీకాంత్, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్ రెడ్డి హాజరై దేవాలయంలో పూజలు నిర్వహించి దేవాలయాన్ని ప్రభుత్వానికి విలీనం చేసుకోవడం జరిగింది. అనంతరం శ్రీకాంత్ మీడియాతో మాట్లాడుతూ ఆనాటి వైయస్ రాజశేఖర్ రెడ్డి 16 వేల దేవాలయాలను ధూపదీప నైవేద్యం క్రింద తీసుకొని దేవాలయాల పటిష్టతకు ఎంతో కృషి చేశారని, నేడు సిఎం జగన్మోహన్ రెడ్డి దేవాలయ వ్యవస్థను పటిష్టత పరిచేందుకు భజన మండలి, అర్చకులకు జీతాలు వేతనాల పెంపు అర్చకులకు వయో పరిమితి లేకుండా వారి సేవలను వినియోల్చుకునేందుకు అవకాశం ముఖ్య మంత్రి చేయడం జరుగుతుందన్నారు. దేవాలయం ప్రభుత్వంలోనికి విలీనం చేసేందుకు ఆవుల నారాయణరెడ్డి ఎంతో కృషి చేశారని కొనియాడారు. అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ దేవాలయానికి అన్ని విధాల అభివృద్ధి చేస్తామన్నారు. అనంతరం శ్రీకాంత్‌ను ఆవుల నారా యణరెడ్డి, జయసుధ, గ్రామ పెద్దలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ నాయకులు రామలింగేశ్వర్ రెడ్డి, ఉప సర్ప ంచ్ నరసింహులు, పువ్వాడి భాస్కర్, డాక్టర్ రఫిక్, ఓబన్న గౌడ్ ఓబుల్ రెడ్డి, స్వామి, దాసు, భజన మండలి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.


శివ రామాలయాన్ని ప్రభుత్వానికి విలీనం చేస్తున్న దృశ్యం

హామీలు అమలు చేయాలి : సిఐటియు



మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి 2019 ఎన్నికల ముందు ప్రతిపక్ష నేతగా అసెంబ్లీలోనూ బయట పాదయాత్రలోనూ మున్సిపల్ కార్మికులకు ఉద్యోగులకు అనేక హామీలు ఇచ్చారని వెంటనే వాటిని అమలు చేయాలని సిఐటియు జిల్లా నాయకులు కే భాస్కర్ రెడ్డి, టీ గోపాలకృష్ణ, వ్యకాసం జిల్లా సహాయ కార్యదర్శి పి పకీరు సాహెబ్ డిమాండ్ చేశారు. గురువారం సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఇంజనీర్ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, డైలీ వేజ్ కార్మికులను రెగ్యులర్ కార్మికులుగా గుర్తించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం 21000 వేతనం ఇవ్వాలని తదితర సమస్యలు పరిష్కరించాలని స్థానిక మున్సిపల్ కార్యాలయం నుండి ర్యాలీగా పాతబస్టాండ్ మీదుగ పటేల్ సెంటర్ చేరుకొన్నారు. అనంతరం అక్కడ మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు పరమేష్ అధ్యక్షతన నిర్వహించగా సిఐటియు జిల్లా నాయకులు కే భాస్కర్ రెడ్డి, ఈ గోపాలకృష్ణ, వ్యకాసం జిల్లా సహాయక కార్యదర్శి పిపకీర్ సాహెబ్ మాట్లాడారు. మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ఈనెల 21న బైక్ ర్యాలీలు నిర్వహిస్తున్నాం అని తెలిపారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రూరల్ అధ్యక్ష, కార్యదర్శులు సి నాగన్న, వి ఆంజనేయులు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు భాస్కర్, నాగేశ్వరరావు, సర్వర్ ఖాన్, రామకృష్ణ, చాంద్ బాషా, విజయ్, మారెన్న, చెన్నయ్య, రాము, సామన్న, తదితర కార్మికులు పాల్గొన్నారు.

బోయ రేవుల - అయ్యవారిపల్లిలో గడపగడప

ప్రజాశక్తి - వెలుగోడు

బోయరేవుల - అయ్యవారిపల్లి గ్రామాలలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి ముంతల విజయభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో గడప గడప కార్యక్రమం గురువారం చేపట్టారు. సంక్షేమ ఫలాలు అందించే దిశగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై విశ్లేషణ ఇస్తూ ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

జవాన్ల సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి - బేతంచెర్ల

భారతదేశం భద్రతకు ఆర్మీ జవాన్లు అందిస్తున్న సేవలు చిరస్మర ణీయమని బేతంచర్ల రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు రామేశ్వర్ రెడ్డి, శ్రీధర్ అన్నారు. గురువారం నాడు బేతంచెర్ల పట్టణంలోని రోటరీ క్లబ్ ఆధ్వర్యం లో రిటైర్డ్ ఆర్మీ జవాన్లు అయినా బుగ్గన విశ్వనాథరెడ్డి, హెంద్రి బాబు, మద్దిలేటి మాబాష, ఆనంద్, తదితరులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో హెూటల్ క్లబ్ సభ్యులు విజయ నాగరాజు, గుండా గోపాల్, సత్తార్, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

బంగారు తాపడంకు విరాళం

ప్రజాశక్తి - శ్రీశైలం

మల్లికార్జున స్వామివార్ల ఆలయం పడమటి ధ్వజస్తంభానికి బంగా రు తాపడం కొరకు విరాళంగా రూ. 2,00,000లను హైదరాబాద్ చెందిన మహిసాయి శ్రీనివాస్ బొబ్బిలి, కుటుంబ సమేతంగా కలిసి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు వి. రామకృష్ణకు గురువారం అందజేశారు. ఈ విధంగా అందజేసిన దాతలకు శేష వస్త్రాలను ప్రసాదాలను అందజేసినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమములో ధర్మకర్తల మండలి సభ్యులు శ్రీ మేరాజోత్ హనుమంత్ నాయక్, సహాయ స్థపతి అయిలూరు ఉమా వెంకట జవహర్ పాల్గొన్నారు.

22న మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - పగిడ్యాల

ఈనెల 22వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వెంకటరమణ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి జడ్పిటిసి, ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచులు హాజరుకావాలని ఆయన కోరారు. మండలంలోని ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలతో హాజరు కావాలని ఆయన సూచించారు. సర్వసభ్య సమావేశానికి హాజరుకాని అధికారులపై జిల్లా ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ప్రతి ఒక్క మండల స్థాయి అధికారి హాజరు కావాలన్నారు.

కొట్టాల చెరువులో ఉచిత ఎక్స్ రే క్యాంపు

ప్రజాశక్తి - ఆత్మకూరు

మండల పరిధిలోని కొట్టాల చెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు గురువారం నాడు సేవా భారతి, శ్రీ అశ్విని హాస్పిటల్ కర్నూల్ వారి సహకారంతో ఉచిత ఎక్స్ రే క్యాంపును సర్పంచి నాగ లక్ష్మి, సీనియర్ ట్రీట్మెంట్ సూపర్వైజర్ కల్లూరి పెద్ద మస్తానయ్య ప్రారంభించారు. వైద్యులు గిరిజనులకు ఎక్స్ రేలు తీసి రైతులు వాటిని పరిశీలించి, అవసరమైన వారికి మందులను అందించారు. కొట్టాల చెరువు గ్రామ పెద్దలు గంగాధర్ వీరన్న, రవికుమార్, ఎస్‌టిఎస్ సౌజన్య రాణి, ఎస్‌టిఎల్ ఎస్ సత్యం, సేవ భారతి జిల్లా కార్యదర్శి వాసుదేవ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.



శ్రీశైల జలాశయం నుండి నీటి విడుదల

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

కృష్ణ పరివాహక ప్రాంతాల నుండి గత కొన్ని రోజులుగా శ్రీశైలం జలాశయానికి నీటి ప్రవాహం నిలిచిపోయింది. గురువారం మధ్యాహ్నం 3 గంటల సమయానికి శ్రీశైలం జలాశయం నుండి 27,478 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అదే సమయానికి జలాశయం నీటి మట్టం క్రమంగా తగ్గుముఖం పట్టి 861.50 అడుగులకు చేరింది. నీటి నిలువ సామర్థ్యం 110.6080 టిఎంసిలుగా నమోదయింది. శ్రీశైలం బ్యాక్ వాటర్ నుండి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌కి 11,208 క్యూసెక్కులు, హంద్రీ నీవా సుజలా స్రవంతికి 689 క్యూసెక్కులు, మహాత్మా గాంధీ కల్వ కుర్తి లిఫ్టిరియర్‌కు 2,400 క్యూసెక్కులు కలిపి మొత్తం 27,478 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. అలాగే తెలంగాణ పరిధిలోని ఎడమ గట్టు భూగర్భ జలవిద్యుత్తు కేంద్రంలో గడిచిన 24 గంటలలో 12,863 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తూ 6.665 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తిని చేస్తూ దిగువ సాగర్‌కు అదే నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయంలో దాదాపు 301 క్యూసెక్కుల నీరు ఆవిరవుతున్నట్లు గేజింగ్ సిబ్బంది తెలిపారు.

సంక్షేమ పథకాలే పార్టీకి రక్ష : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చాగలమర్రి

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులే పార్టీకి శ్రీరామరక్ష అని ఆళ్ళగడ్డ ఎంఎల్ఎ గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. గురువారం ఆయన చాగలమర్రి గ్రామంలోని సెయింట్ ఆన్స్ స్కూల్ ఎదురుగా వున్న ఆష్రఫ్ నగర్‌లో వైసిపి నాయకుడు వ్యాపారవేత్త మాలిక్ బాష నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. 2024 సార్వత్రిక ఎన్నికలలో ప్రజలు తిరిగి వైసిపినే గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో వైసీపీ ఎపి స్టేట్ మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ బాబులాల్,మండల కన్వీనర్ కుమార్ రెడ్డి, వైసిపి ఆళ్ళగడ్డ నాయకులు నరసింహారెడ్డి, ఎంపిపి లు గజ్జల రాఘవేంద్రారెడ్డి, వీరభద్రుడు, ఉపాధ్యక్షుడు ముల్లా రఫీ, ఉప సర్పంచ్ మహమ్మద్ సోహెల్,ఎంపీటీసీ ఫయాజ్,వైసీపీ నాయకులు అబ్దు ల్లా, షబ్బీర్,ఖాదర్‌బాష మాబుసున్న, జీలాన్ బాష తదితరులు ఉన్నారు.


నూతన గృహాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

శ్రీశైలంలో ఆర్జిత అభిషేకాలు నిలుపుదల : ఇఒ

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రావణ మాసంలో ఆర్జిత అభిషేకాలు నిలుపుదల చేస్తున్నట్లు దేవస్థానం కార్యనిర్వహాధికారి లవన్న తెలిపారు. గురువారం ఇఒ మాట్లాడుతూ ఆగస్టు 17వ తేదీ నుంచి సెప్టెంబర్ 15వ తేదీ వరకు నిజ శ్రావణ మాసం ఉంటుందని, ఈ మాసంలో భక్తుల సౌకర్యార్థమై స్వామివారి గర్భాలయ అభిషేకం సామూహిక అభిషేకాలను నిలుపుదల చేయడం జరిగిందని తెలిపారు. దర్శనం టికెట్లను దేవస్థానం వెబ్సైటు www. Srisaila devasthonom.org ద్వారా ఆన్ లైన్ ద్వారా పొందవలసి ఉంటుందన్నారు. ఆగస్టు మాసం టికెట్లను ఇప్పటికే ఆన్లైన్లో ఉంచడం జరిగిందని, సెప్టెంబర్ మాసం టికెట్లను ఆగస్టు 25వ తేదీ నుండి ఆన్లైన్లో ఉంచడం జరుగుతుందని, దర్శనం టికెట్లను సమయానకులను బట్టి ఒక గంట ముందు వరకు ఆన్లైన్లో ఉంచడం జరుగుతుందన్నారు. 70 శాతం టికెట్లను కరెంటు బుకింగ్ పొందవచ్చునని పేర్కొన్నారు. నిర్దిష్ట రోజుల్లో కాకుండా మామూలు రోజులలో మంగళ, బుధ, గురు, శుక్రవారాలలో మధ్యాహ్నం రెండు గంటలకు స్పర్శ దర్శనం యధావిధిగా ఉంటుందని ఇఒ తెలిపారు.

వ్యవసాయ అధికారుల సలహాలు పాటించాలి

ప్రజాశక్తి - ఆత్మకూరు/కొత్తపల్లి

ఆత్మకూర్ వ్యవసాయ డివిజన్లోని ఆత్మకూరు, కొత్తపల్లి మండలాల్లో మొక్కజొన్న పంటలను ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ కే ప్రభాకర్, డాక్టర్ జె మంజునాథ్, డాక్టర్ ఆర్ నరసింహులు, సహాయ వ్యవసాయ సంచాలకులు రెగ్యులర్ బి ఆంజనేయ, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి హేమలత, మండల వ్యవసాయ అధికారులు విష్ణువర్ధన్ రెడ్డి, మహేష్, రైతు భరోసా కేంద్ర సిబ్బంది, రైతులతో కలిసి బాపనంతాపురం నల్ల కాలువ కరివేన, నందికుంట, బావపురం, శ్రీపతిరావుపేటల్లో పంటలను సందర్శించి, మొక్కజొన్న పంటపై రైతులకు పలు సూచనలు చేశారు. పంట నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆర్‌బికె సిబ్బందిని ఆదేశించారు.

మద్దిలేటి స్వామి క్షేత్రంలో ఉత్సవాలు

ప్రజాశక్తి - బేతంచర్ల

మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామ పరిధిలో వెలిసిన వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో గురువారం నుండి సెప్టెంబర్ 14వ తేదీ వరకు శ్రావణ మాస ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయం ఈవో పాండు రంగారెడ్డి చైర్మన్ సీతారామ చంద్రుడు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రావణ మాసంలో ప్రతి శుక్రవారం, శనివారంలలో అధిక సంఖ్యలో స్వామివారి భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని సౌకర్యాలతో ఉత్సవాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 25వ తేదీ వరలక్ష్మీ వ్రతం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

ఆర్‌పిపై దాడి చేసిన వారిపై
చర్యలు తీసుకోవాలి : సిఐటియు

ప్రజాశక్తి - డోన్

రాజకీయ ప్రోద్భలంతో ఆర్‌పి కళ్యాణిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, ఇక ముందు ఇటువంటి సంఘటనలు జరగకుండా చూడాలని సిఐటియు పట్టణ కార్యదర్శి టి.శివరాం, మండల అధ్యక్షులు పి.రామాంజనేయులు, ఆర్పీల యూనియన్ అధ్యక్ష,కార్యదర్శులు బి.సుజాత, సునీత, కోశాధికారి జైనాబి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ వెంకటరామిరెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తోటి ఆర్పీ మహేశ్వరి అధికార పార్టీ నాయకుల అండదండలతో సంబంధం లేని విషయంలో జోక్యం చేసుకొని గొడవ సృష్టించి ఈ నెల 12న కళ్యాణిపై దాడి చేయడం దారుణమన్నారు. అధికారం శాశ్వతం కాదన్న విషయాన్ని పాలకులు గుర్తుంచుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో ఆర్పీలు కళ్యాణి, ఈరమ్మ, నూర్జహాన్, సరస్వతి, సుగుణమ్మ, శశికళ, మంగమ్మ, రత్నాభాయి, మహబూబి, అరుణ, రాగసుధ, జరీనాబి, కుమారి, చాంద్ బి తదితర 35 మంది ఆర్పీలు పాల్గొన్నారు.



సొసైటీ అభివృద్ధికి కృషి : చైర్మన్

ప్రజాశక్తి - పాములపాడు

మండలంలోని వేంపెంట ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం చైర్మన్‌గా పాములపాడు గ్రామం మచ్చ పెద్ద వెంకటస్వామి గురువారం నాడు ప్రమాణ స్వీకారం చేశారు. డైరెక్టర్లుగా గోపాల్, చింతకుంట నాగలక్ష్మమ్మలు ప్రమాణ స్వీకారం చేయగా.. చైర్మన్ పెద్ద వెంకటస్వామిని పలువురు నాయకులు, సర్పంచులు, రైతులు ఘనంగా సన్మానించారు. చైర్మన్ వెంకటస్వామి మాట్లాడుతూ రైతులకు అందు బాటులో ఉండి సేవ చేస్తానన్నారు. మండల వైసీపీ నాయకులు టిఎన్ ఆర్ కంపెనీ యజమాని తెలుగు నాగరాజు మాట్లాడుతూ 'మా నాన్నగారికి చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి ఆశీస్సులతోనే వచ్చిందని కృతజ్ఞులై ఉంటామని, బైరెడ్డి సిద్ధార్థ రెడ్డికి, సిఎం జగన్ మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. చిన్న, సన్న కారు రైతు కుటుంబం నుండి ఎదిగిన తమకు రైతులకు సేవ చేసుకునే అవకాశం రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈఓ సునీల్ రెడ్డి,మద్దూర్ సింగిల్ విండో చైర్మన్ గడ్డం కృష్ణారెడ్డి, మాజీ చైర్మన్‌లు ఎల్వి రమణారెడ్డి, శివ పుల్లారెడ్డి, వేంపెంట ఎంపీటీసీ నాగలక్ష్మమ్మ, పాములపాడు సర్పంచ్ మేకల భాగ్యమ్మ, ఇస్కాల సర్పంచ్ మౌలాలి, చెలిమిల్ల సర్పంచ్ చంద్రారెడ్డి, వివేకానంద, పాఠశాల కరస్పా ండెంట్ ఆర్ఎస్ఆర్ గోపాల్, వైసిపి మండల, గ్రామాల నాయకులు జూటూరు మధు, చౌడయ్య, బంగారు బాష, అంబయ్య, చరణ్ గ్రామ పెద్దలు సామేలు, బహదూర్ రైతులు పాల్గొన్నారు.


చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేస్తున్న మచ్చ పెద్ద వెంకటస్వామి

పాఠశాల ఎదురుగా మైనింగ్ లీజును రద్దు చేయాలి

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని పలుకూరు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదురుగా వున్న మైనింగ్ లీజును రద్దు చేయాలని బిజెపి ఓబీసీ జిల్లా అధ్యక్షులు శివ కృష్ణ యాదవ్, జనసేన నాయకులు భాస్కర్లు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని మైనింగ్ కార్యాలయంలో మైనింగ్ ఏడి రాజగోపాల్‌కు బిజెపి, జనసేనల ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ పాఠశాల ఎదురుగా మైనింగ్ మాఫియా అక్రమ మార్గంలో లీజు తెచ్చుకొని విద్యార్థుల భవిష్యత్తు, గ్రామస్తుల భవిష్యత్తును అంధకా రంలో నెట్టెందుకు ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. మైనింగ్ బ్లాస్టింగ్ వల్ల పాఠశాల గదులు, గ్రామంలో ఉన్న ఇల్లు బీటలు వారుతాయన్నారు. తక్షణమే మైనింగ్ లీజును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బిజెపి జిల్లా కార్యదర్శి యాదగిరి, పలుకూ రు గ్రామ పెద్దలు వెంకటరమణ, చంద్రశేఖర ఆచారి, బిజెపి జిల్లా నాయకులు శివరామిరెడ్డి, నాగ మల్లారెడ్డి, శంకరయ్య, మల్లయ్య, జనసేన పార్టీ నాయకులు ఇద్రుస్ భాషా, షేక్షావలి, సుబ్బారావు, నరసింహ, మహబూబ్ బాషా పాల్గొన్నారు.

యువత స్వయం ఉపాధిలో రాణించాలి

ప్రజాశక్తి - చాగలమర్రి

యువత,నిరుద్యోగులు స్వయం ఉపాధి రంగాల్లో రాణించాలని వైసీపీ రాష్ట మైనార్టీ సెల్ కార్యదర్శి బాబులాల్, వైసిపి మండల కన్వీనర్ కుమార్ రెడ్డిలు సూచించారు. గురువారం చాగలమర్రి పట్టణానికి చెందిన అనీస్ చింతలచెరువు రస్తాలో ఏర్పాటు చేసిన సిజర్స్ మెన్స్ పార్లర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువకులు ఉద్యోగాల కోసం నిరీక్షిస్తూ సమయాన్ని వృధా చేసుకోకుండా స్వయం ఉపాధి రంగాల్లో రాణించాలన్నారు. ఇలా చేస్తే స్వయం ఉపాధి పొందడంతో పాటు మరో నలుగురికి జీవనోపాధి కల్పించిన వారవుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సోహెల్,వైస్ ఎంపీపీ రఫి,వైసీపీ నాయకులు వెంకటరమణ, దక్కన్ రమణారెడ్డి, మాబుసున్న, అబ్దుల్లా, ముల్లా ఖాదర్ బాషా,జల్సా గౌస్, బబ్లూ తదితరులు పాల్గొన్నారు.


మెన్స్ పార్లర్‌ను ప్రారంభిస్తున్న వైసీపీ నాయకులు

ఆరుతడి పంటలకు సాగునీరు విడుదల

ప్రజాశక్తి - రుద్రవరం

తెలుగు గంగప్రధాన కాలువ పరిధిలో సాగు చేసిన ఆరుతడి పంటలకు వారం రోజులపాటు సాగునీరు విడుదల చేస్తున్నట్లు గంగ అధికారులు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. తెలుగు గంగ ఆధారంగా రైతులు ఇదివరకే సాగుచేసిన మొక్కజొన్న, పత్తి, కంది, సోయాబీన్ తదితర ఆరుతడి పంటలకు మాత్రమే సాగునీరు విడుదల చేస్తున్నట్టు అధికారులు వెల్లడించారు. తొందరపడి వరి పంటలు సాగు చేసుకోవద్దని ఆయకట్టు రైతులను కోరారు. ఈ నెల చివరి వారంలో తుంగభద్ర, కృష్ణా నది ఎగువ ప్రాంతాలలో నమోదయ్యే వర్షపాతం, నదులలోని నీటి నిల్వల ఆధారంగా ఖరీఫ్ ఆయకట్టుకు నీరు అందించే విషయంపై ఉన్నతాధికారులతో చర్చించి తగిన ప్రకటన విడుదల చేస్తామని, ఇందుకు రైతాంగం సహకరించాలని కోరారు. కెసి కాల్వకు ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం ద్వారా, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా నీటిని విడుదల చేస్తున్నట్లు గంగ అధికారులు తెలిపారు.


ఎంపీడీవో శివరామయ్యను సన్మానిస్తున్న దృశ్యం

ఎంపిడిఒ శివరామయ్యకు సన్మానం

ప్రజాశక్తి - బనగానపల్లె

ప్రభుత్వ సంక్షేమ పథకాలను పకడ్బందీగా నిర్వహించి ఉత్తమ అవార్డు అందుకున్న ఎంపీడీవో శివరామయ్యను గురువారం ఆయన కార్యాలయంలో వైసిపి నాయకులు, హెూటల్ అసోసియేషన్ నాయకులు ఘనంగా సన్మానించారు. మాజీ ఎంపిటిసి ఈసారి యల్లయ్య, 6వ వార్డు మెంబర్ సురేష్, పట్టణ హెూటల్ అసోసియేషన్ అధ్యక్షులు సయ్యద్ హైదర్‌ల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు మాభాష, కార్తీక్, హెూటల్స్ అసోసియేషన్ నాయకులు నాగేష్, సుమంత్, ప్రసాద్, అశోక్, శ్రావణ్, భాష తదితరులు పాల్గొన్నారు .

శ్రీశైలంలో చిరుత సంచారం

- అప్రమత్తమైన దేవస్థానం అధికారులు : ఇఒ

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైలంలో చిరుతపులి సంచారంపై దేవస్థానం అధికారులు అప్రమత్తమైనట్లుగా కార్యనిర్వహణ అధికారి లవన్న తెలిపారు. గురువారం ఇఒ మాట్లాడారు. శ్రీశైలంలోని వలయ రహదారి సమీపంలో ఇటీవల చిరుత సంచారంతో స్థానికులు ఈ విషయం అటవీ అధికారుల సహాయతో అడవిలోకి వెళ్లేవిధంగా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఇటీవల తిరుమలలో చిన్నారిపై చిరుత దాడి ఘటన నేపథ్యంలో శ్రీశైల దేవస్థానం అలెర్ట్ ప్రకటించడం జరిగిందని, క్షేత్ర పరిధిలో చిరుతపులి, పెద్దపులి, ఎలుగు బంటి వన్యప్రాణులు సంచారంపై అటవీశాఖ అధికారులతో చర్చించామని ఇఒ అన్నారు. రాత్రుల సమయాలలో జంతువులు క్షేత్ర పరిధిలోకి రాకుండా టపాసులు పేలుస్తూ శబ్దాలతో క్షేత్రంలోకి చిరుతపులులు రాకుండా చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. భక్తుల రక్షణకై అడవి జంతువులు క్షేత్రపరిధిలోకి రాకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తామని, క్షేత్ర పరిధిలో పెన్సింగ్ ఏర్పాటుకు సుమారు రూ.5 కోట్ల 30 లక్షలతో టెండర్ పిలిచేందుకు ఏర్పాటు చేశామని ఇఒ తెలిపారు. జంతువుల నుండి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా రక్షణ కల్పిస్తామని ఇఒ లవన్న తెలిపారు.

మెడిసిన్‌లో చాగలమర్రి విద్యార్థి సత్తా..

ప్రజాశక్తి - చాగలమర్రి

చాగలమర్రి పట్టణంలోని చిన్నమకానం వీధికి చెందిన విద్యార్థి శ్రీధర్ నీట్‌లో ఆల్ ఇండియా లెవల్‌లో 86576వ ర్యాంకు,రాష్ట్ర స్థాయిలో 3476 ర్యాంకు సాధించి కర్నూలు మెడికల్ కళాశాలలో సీటు సాధించాడు. సాదారణ మెడికల్ స్టోర్ లో పని చేస్తూ జీవనం సాగిస్తున్న శివుడు,శాంత దంపతుల ఏకైక కుమారుడు శ్రీధర్ అత్యుత్తమ ర్యాంకు సాధించి వైద్య విద్యకై కర్నూలు ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు సాధించడంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు. చాగలమర్రి పట్టణంలోని సెయింట్ ఆన్స్2019లో పదవ తరగతిలో 9.7 పాయింట్లు,హైదరాబాద్ నారాయణ కళాశాలలో ఇంటర్ బైపిసిలో 968 మార్కులు సాధించాడు. అదే సంవత్సరం తొలిప్రయ త్నంలో నీట్‌లో మంచి ర్యాంకు సాధించి లేకపోవడం తో,సీటు సాధించాలన్న పట్టుదలతో ఏడాది పాటు లాంగ్‌టర్మ్ కోచింగ్ తీసుకొని ఇటీవల విడుదలైన నీట్ ఫలితాలలో అత్యుత్తమ ర్యాంకు సాధించి మెడికల్ సీటు సాధించాడు. గ్రామీణ విద్యార్థి శ్రీధర్ మెడికల్ సీటు సాధించడంతో పలువురు అభినందిం చారు.

ప్రజలకు వైద్య సేవలు అందిస్తా : విద్యార్థి శ్రీధర్

ఎంబిబిఎస్ విద్యను పూర్తి చేసిన తరువాత ఎంఎస్ ఉన్నత విద్యను పూర్తి చేసిన అనంతరం చాగలమర్రిలో ఆసుపత్రిని ఏర్పాటు చేసి ప్రజలకు వైద్యసేవలు అందించి గ్రామ ప్రజల ఋణం తీర్చుకుంటా.


విద్యార్థి కి మిఠాయి తినిపిస్తున్న తల్లిదండ్రులు

మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా షేక్ రహమత్

- వైస్ చైర్మన్‌గా మొల్ల షరీఫ్

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్




నందికొట్కూరు మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా 17వ వార్డు మాజీ కౌన్సిలర్, వైసీపీ సీనియర్ నాయకులు అబ్దుల్ జబ్బార్ సతీమణి షేక్ రహమత్, వైస్ చైర్మన్‌గా శాతనకోట గ్రామానికి చెందిన మొల్ల షరీఫ్ నియమితులయ్యారు. బీసీ మహిళలకు మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవికి నియమించిన సందర్భంగా పట్టణ వైసిపి ముస్లిం మైనార్టీ వైసీపీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. మాజీ కౌన్సిలర్ అబ్దుల్ జబ్బార్ మాట్లాడుతూ శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి కృషి పట్టుదల వల్లే బీసీ మహిళకు మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవి దక్కిందని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నామని షేక్ రహమత్, మొల్ల షరీఫ్ బాషా అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్‌సి ఇంటర్ కోర్సులు ఉపయోగించుకోండి

ప్రజాశక్తి - ఆత్మకూరు

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠ ఆధ్వర్యంలో గురువారం నాడు విద్య ప్రాధాన్యత వివరిస్తూ గురువారం నాడు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గౌడ్ సెంటర్లో జరిగిన కార్యక్రమంలో ఎంఈఓ జానకిరామ్, సురేష్, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ శ్రీ లక్ష్మీనారాయణ, రామ్ రెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రఘురామాచార్యులు, హెచ్ఎం నాగరాజు, తదితరులు మాట్లాడుతూ చదువుకు దూరమైన వారికి బడిని మధ్యలో మానివేసిన వారు ఎస్ఎస్‌సి ఇంటర్మీడియట్ కోర్సులు ద్వారా తమ విద్యను కొనసాగించువచ్చునని, అడ్మిషన్లు జరుగుతున్నాయని అన్నా రు. కార్యక్రమంలో సిఆర్పిలు, తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాల్ రెడ్డిని గెలిపించండి : ఎంపీపీ

ప్రజాశక్తి - బేతంచెర్ల

మండల పరిధిలోని ఎం పెండకల్లు గ్రామంలో ఈనెల 19వ తేదీన జరుగు వార్డు ఎన్నికలలో వైసిపి బలపరుస్తున్న వేణుగోపాల్ రెడ్డి గౌను గుర్తుకే ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని బేతంచెర్ల మండలం ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, సీనియర్ నాయకులు బాబుల్ రెడ్డి అన్నారు. మండలంలోని ఎం పెండకల్లు గ్రామంలో ఎన్నికల ప్రచార నిమిత్తం వారు పాల్గొని మాట్లాడారు. సంక్షేమం అభివృద్ధిని రాజకీయాల కతీతంగా సేవలందిస్తున్న వైఎస్సార్సీ బలపరిచిన వేణుగోపాల్ రెడ్డిని తమ అమూల్యమైన ఓటును వేసి గెలిపించాలని వీధి వీధి తిరుగుతూ ఓట్లను వారి అభ్యర్థించారు. గోరుమాను కొండ సర్పం చ్ కోడే వెంకటేశ్వర్లు, తిరుమలేశ్వర్ రెడ్డి, చంద్రశేఖర్, రామ నాయుడు, వెంకటేశ్వర్లు, కృష్ణుడు పాల్గొన్నారు.

ఆందోళనతోనే కెసికి నీరు : టిడిపి

ప్రజాశక్తి - నందికొట్కూరు

పంటలు ఎండిపోతున్న నేపథ్యంలో రైతుల పక్షాన మల్యాల పంప్ హౌస్ టిడిపి ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనతో నేడు కెసికి నీరు విడుదల చేయడం రైతు కళ్ళల్లో ఆనందం కలగడంలో తమ కృషి ఉందని సీనియర్ టిడిపి నాయకులు పల్లె రఘురాం రెడ్డి, లాయర్ జాకీర్ హు స్సేన్, ముర్తుజావలి, రాష్ట్ర ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గిత్త జయ సూర్య చేశారు. గురువారం నందికొట్కూరు మండల పరిధిలోని మల్యాల గ్రామ లో ఉన్న హంద్రీనీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం వద్ద టిడిపి నాయకులు తమ పోరాట ఫలితంగానే కేసికి నీరు విడుదల అంటూ జెండాలు చేతబూని సంతోషాన్ని వ్యక్తం చేశారు. అనంతరం రాష్ట్ర ఎసిసిఎల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జయ సూర్య పల్లె రఘురామిరెడ్డి,ముర్తు జావలి లాయర్ జాకీర్ ఉస్సేన్ లు మాట్లాడారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సురేంద్ర నాథ్ రెడ్డి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, తదితరులు రైతులు పాల్గొన్నారు.

9న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - ఆత్మకూరు

సెప్టెంబర్ 9వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్ మెగా క్యాంపుని జయప్రదం చేయాలని ఆత్మకూరు సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు, జూనియర్ సివిల్ జడ్జి తేజ సాయి అన్నారు. గురువారం నాడు కోర్టు ఆవరణంలో పోలీస్ అధికారులు ఇతర అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వారు మాట్లాడుతూ లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యే విధంగా కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ సమీక్ష సమావేశంలో ఆత్మకూరు ఎస్సై నారాయణరెడ్డి, కొత్తపల్లి ఎస్ఐ హుస్సేన్ బాష, తదితరులు పాల్గొన్నారు.